

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com




హైదరాబాద్ | బుధవారం 12-5-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 236 | పేజీలు: 4 | వెల: రూ.1/-

### రష్యాలో పాఠశాలపై కాల్పులు

# 13 మంది దుర్మరణం



మాస్కో : రష్యాలోని ఓ పాఠశాలపై గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 13 మంది దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో 8 మంది విద్యార్థులు ఉన్నారు. చాలా మంది విద్యార్థులను బందీలుగా చేసుకున్నారు. వీరిని విడిపించేందుకు సైన్యం రంగంలోకి దిగింది. ఇద్దరు వ్యక్తులను భద్రతా దళాలు కాల్చిచంపినట్లు వార్తలు వచ్చాయి.

రష్యాలోని కజాన్ నగరంలో మంగళవారం ఉదయం ఒక పాఠశాలలోకి ప్రవేశించిన దుండగులు విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ దాడిలో ఇప్పటివరకు 13 మంది మరణించారు. మరణించిన వారిలో 8 మంది పిల్లలు, ఓ ఉపాధ్యాయుడు ఉన్నారు. పాఠశాలలో పేలుడు, కాల్పులతో విద్యార్థులు గందరగోళానికి గురయ్యారు. పెద్ద ఎత్తున పొగ వెలువడటంతో అగ్నిప్రమాదం భావించి పలువురు భవనంపై నుంచి దూకినట్లు సమాచారం.

దాడి జరిగినప్పుడు ఇద్దరు పిల్లలు మూడో అంతస్తు కిటికీ నుంచి కిందికి దూకినట్లు అత్యవసర సేవ ప్రతినిధులు తెలిపారు. ఎత్తు నుంచి పడిపోవడంతో ఇద్దరు మరణించారని ఆయన చెప్పారు. పాఠశాల నాలుగో అంతస్తులో దాడి చేసిన వ్యక్తి కూడా కొంతమందిని బందీగా చేసుకున్నాడని రష్యా వార్తా సంస్థ ఆర్ఐఏ తెలిపింది. గాయపడిన 12 మందిని స్థానిక దవాఖానలో చేర్చారు.

పాఠశాల లోపల కూడా పేలుడు జరిగిందని వార్తా సంస్థ తెలిపింది. కాల్పులు జరుపడానికి ముందు వారు పేలుళ్లు జరిపినట్లు ప్రత్యక్ష సాక్షి ఒకరు చెప్పారు. పేలుడు శబ్దాలు విన్న పలువురు విద్యార్థులు పాఠశాల పై అంతస్థుల నుంచి కిందికి దూకారని, వారిలో చాలా మందికి తీవ్రంగా గాయాలయ్యాయని తెలిపారు.

దాడి విషయం తెలియగానే భద్రతా దళాలు రంగంలోకి దిగి పాఠశాలను చుట్టుముట్టాయి. కాల్పులకు తెగబడినవారిని పట్టుకునేందుకు వారు సిద్ధమయ్యారు. దాడికి పాల్పడిన ఇద్దరిని భద్రతా దళాలు కాల్చిచంపాయి. షూటర్ వయస్సు 19 సంవత్సరాల వరకు ఉంటుందని, అతడి వద్ద రిజిస్టర్డ్ గన్ ఉన్నదని అధికారులు తెలిపారు. ఈ సంఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. 17 ఏండ్ల వయసున్న ఓ వ్యక్తిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. అతడు ఈ దాడికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పాఠశాల భవనం దెబ్బతిన్న వీడియోలు సోషల్ మీడియాలో వస్తున్నాయి. దాడికి పాల్పడింది ఎవరనేది ఇంకా స్పష్టంగా తెలియరాలేదని పోలీసులు చెప్పారు.

### రేపటి నుంచి పది రోజుల పాటు

# తెలంగాణలో లాక్‌డౌన్



హైదరాబాద్ , మే 11: తెలంగాణలో కరోనా కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం లాక్ డౌన్ విదించింది. ఈరోజు సమావేశమైన తెలంగాణ రాష్ట్ర కేబినెట్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మే 12, బుధవారం ఉదయం 10 గంటల నుంచి పదిరోజుల పాటు లాక్ డౌన్ అమలు చేయాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు అన్నీ కార్యకలాపాలకు అవకాశం వుంటుందని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. టీకా కొనుగోలు కొరకు గ్లోబల్ టెండర్లను పిలవాలని క్యాబినెట్ నిర్ణయించింది.

కోర్టు అడిగిన మేరకు జవాబు ఇచ్చేందుకు సిద్ధమైన తెలంగాణ ప్రభుత్వం ఈ మేరకు లాక్ డౌన్ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. తెలంగాణలో ఇటీవల కొద్దిమేర కరోనా కేసులు, మరణాలు తగ్గినా? ఇతర ప్రాంతాల్లో సెకండ్ వేవ్ ఉధృతిని దృష్టిలో ఉంచుకుని కొన్నిరోజుల పాటు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. కాగా, రంజాన్ (మే 14) తర్వాత లాక్ డౌన్ ప్రకటిస్తారని మొదట వార్తలు వచ్చాయి. కానీ అన్నివైపుల నుంచి ఒత్తిడి పెరగడంతో రేపటి నుంచే లాక్ డౌన్ అమలు చేయాలని నేటి కేబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు కాసేపట్లో వెలువడనున్నాయి.

## లాక్ డౌన్ లోను మద్యం అమ్మకాలు..? జీవో తెచ్చే యోచనలో సర్కార్

హైదరాబాద్ , మే 11: తెలంగాణలో రేపటి నుంచి లాక్ డౌన్ విధించింది సర్కార్. ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు అన్నీ కార్యకలాపాలకు అవకాశమిచ్చారు. అయితే మద్యం అమ్మకాలపై తెలంగాణ సర్కార్ తర్జన భర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. పొరుగు రాష్ట్రాల మద్యం అమ్మకాల పై వివరాల్ని తెప్పించిన సీఎం? వాటితో పోల్చుకుని తెలంగాణలలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అవసరమైతే కొత్త జీవో తెచ్చి మద్యం అమ్మకాలను కొనసాగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కర్ణాటక లో ఉ.6 నుండి 10 గంటల వరకు మద్యం అమ్మకాలు?ఏపి లో ఉ.6 నుండి 12 గంటల వరకు వైన్, బార్ షాపులు ఓపెన్?.చత్తిస్ గడ్, మహారాష్ట్ర లో సా.6 గంటల వరకు హోం డెలివరీ?

## హైకోర్టు అంటే లెక్క లేదా?'..రాష్ట్రంలో జరిగే వాటికి భాద్యత మీదే: ప్రభుత్వంపై ధర్మాసనం సీరియస్

హైదరాబాద్ , మే 11: తెలంగాణలో కరోనా పరిస్థితులపై హైకోర్టులో అత్యవసర విచారణ జరిపిన ధర్మాసనం ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఫైర్ అయింది. కోవిడ్ కట్టడికి చేపట్టవలసిన అన్ని చర్యలపై హై కోర్టు తెలంగాణ ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేసింది. పలు అంశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు ప్రశ్నల వర్షం కురిపించింది. గత విచారణలో ఎక్స్‌పర్ట్ కమిటీ వేయమని చెప్పాం వేశారా? అని హైకోర్టు ప్రశ్నించింది. "అంతర్ రాష్ట్ర సరిహద్దుల వద్ద అంబులెన్స్ ఆపమని ఎవరు చెప్పారు? ఈ సమయంలో అంబులెన్స్‌లు ఆపడం మానవత్వమా? అంబులెన్స్ రేట్లను నియంత్రించాలని చెప్పాం.. చేశారా? రాష్ట్రంలో జరుగుతున్న వాటికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాల్సి ఉంటుంది. కుంభ మేళా నుంచి తిరిగి వచ్చిన వారిని గుర్తించి టెస్ట్‌లు చేయాలని చెప్పాం చేశారా? పాతబస్తీ వంటి ప్రాంతాల్లో మత పరమైన కార్యక్రమాలను ఎందుకు నియంత్రించడం లేదు? రంజాన్ తరువాత లాక్‌డౌన్ పెడతారా? ఈ లోపే వైరస్ విజృంభిస్తుంది కదా? మేం ఆదేశాలు ఇచ్చిన రోజు హుటాహుటిన ప్రెస్ మీట్ లు పెట్టి పరిస్థితి అంతా బాగుంది లాక్‌డౌన్ అవసరం లేదని ఎలా చెప్తారు? యాక్టివ్ కేసులు ఎందుకు తగ్గుతున్నాయి? మేం టెస్ట్‌ల సంఖ్య పెంచాలని చెబితే అందుకు భిన్నంగా తగ్గించారు ? హై కోర్టు అంటే మీ ప్రభుత్వానికి లెక్క లేదా?" అని ధర్మాసనం ప్రశ్నించింది.

## కరోనాతో 10 మందికి పైగా మావోయిస్టులు మృతి

రాయ్‌పూర్ మే 11: : అడవుల్లో ఉండే మావోయిస్టులను సైతం కరోనా వైరస్ వదలడం లేదు. ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లా దక్షిణి బస్తర్ అడవుల్లో కరోనాతో 10 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందినట్లు దంతెవాడ ఎస్పీ అభిషేక్ పల్లవ వెల్లడించారు. మరో 100 మంది కరోనా బారిన పడినట్లు తమకు సమాచారం ఉందని ఆయన తెలిపారు. కరోనా సోకడం, కలుషిత ఆహారం తినడంతో మావోయిస్టులు చనిపోయినట్లు తెలుస్తున్నది.

కరోనాతో చనిపోయిన వారిలో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నట్లు సమాచారం. అయితే మృతి చెందిన మావోయిస్టుల పేర్లు వెల్లడి కాలేదు. ఇక కుంట, డోర్నపాల్ ఏరియాల్లో మావోయిస్టులు కరోనా వ్యాక్సిన్‌తో పాటు దానికి సంబంధించిన ఔషధాలను దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు.

కరోనా సోకిన వారిలో మోస్ట్ వాంటెడ్ మహిళ మావోయిస్టు సుజాత (25లక్షల రూపాయల రివార్డ్)తో పాటు 10 లక్షల రూపాయల రివార్డులు కలిగిన మావోయిస్టులు జయలాల్, దినేష్ ఉన్నట్టు సమాచారం. కొవిడ్‌తో బాధపడుతున్న మావోలు జనజీవన స్రవంతిలోకి వచ్చినట్లయితే వారందరికీ ప్రభుత్వం తరపున మంచి వైద్యం అందిస్తామని దంతెవాడ ఎస్పీ అభిషేక్ పల్లవ హామీ ఇచ్చారు.

## అవసరం లేకున్నా ఆస్పత్రులకు రాకండి : యడియూరప్ప

బెంగళూర్ మే 11: దవాఖానల్లో అనవసరంగా ఎక్కువ రోజులు గడిపే కొవిడ్-19 రోగులు సత్వరమే డిశ్చార్జి అవడం ద్వారా ఇన్ఫెక్షన్ తీవ్రంగా ఉన్న వారికి అవకాశం కల్పించాలని కర్నాటక సీఎం బీఎస్ యడియూరప్ప పేర్కొన్నారు. యడియూరప్ప మంగళవారం నగరంలోని కొవిడ్ వార్ రూమ్ ను సందర్శించిన అనంతరం మాట్లాడుతూ 332 మంది రోగులు 30 రోజులుగా దవాఖానలో ఉన్నారని, 503 మంది రోగులు 20 రోజులుగా దవాఖానలో చికిత్స పొందుతున్నారని.. ఇలా అనవసరంగా దవాఖానలో ఉండే ప్రజలు ఇంటికి వెళ్లడం మంచిదని సూచించారు.ఇంటి నుంచే చికిత్స పొందే వీలున్న రోగులు సైతం కొవిడ్ కేర్ సెంటర్లలో తిష్ట వేసి దవాఖానలో చికిత్స అవసరమైన రోగులకు బెడ్లు ఖాళీ లేని పరిస్థితి తీసుకువచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. కొవిడ్ వార్ రూమ్ తో దవాఖానల్లో బెడ్ల వివరాలు, ఆక్సిజన్ అందుబాటు, మందుల లభ్యత వంటి సమస్త సమాచారం లభ్యమ వుతుందని చెప్పారు. దేశంలోనే ఆదర్శంగా కొవిడ్ వార్ రూంను కర్నాటక ప్రభుత్వం నిర్వహిస్తోందని అన్నారు.

## మహబూబాబాద్ జిల్లాలో అకాల వర్షం..తడిసిన ధాన్యం

మహబూబాబాద్ మే 11: : జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభమైన ఈ వర్షం పలు మండలాల్లో పంట నష్టాన్ని మిగిల్చింది. జిల్లా కేంద్రం తోపాటు కేసముద్రం, నర్సింహులపేట, చిన్నగూడూరు, బయ్యారం తదితర మండలాల్లో వర్షం కురిసింది. దీంతో అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. ఈదురు గాలులకు మామిడికాయలు నేల రాలాయి. చెట్లు నేల కూలాయి.

### చరిత్రలో నేటినిజం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం



కం॥ చీకాకులు గలిగించెడి
మూకల శిక్షించు న్యాయమూర్తిగ మునమో
వాకమ్ముల నందు కొనెడి
శ్రీ "కె.జీ. బాలకృష్ణ" శేముషి సెంతునే ॥



-రాధశ్రీ
సెల్: 9494481210

( మే 12 సుప్రీం కోర్టు మాజీ ప్రదాన న్యాయమూర్తి జననం...)

## పోలీసుల ఆధీనంలో ఉన్న వాహనాలు

### వివరాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన కరీంనగర్ పోలీసులు

కరీంనగర్ మే 11 (నేటినిజం ప్రతినిధి): డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన, వివిధ ప్రాంతాల్లో వదిలివెళ్ళిన, ఇతర నేరాల్లో వాహనాలతో పట్టుబడి వాహనాలను తీసుకవెళ్ళకుండా ఉన్నవారి వాహనాలను వేలం వేసేందుకు కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు నిర్ణయించారు. హైదరాబాద్‌సిటి పోలీస్‌యాక్ట్ ప్రకారం సదరు వాహనాలను 06నెలల అనంతరం వేలం వేయనున్నారు. ఈ మేరకు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన ట్విట్టర్, ఫేస్‌బుక్‌లలో మంగళవారంనాడు వివరాలను పొందుపరిచారు.

పైన పేర్కొన్న అంశాల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న 318 వివిధ రకాల వాహనాలు కమిషనరేట్‌లోని పోలీసులు ఆధీనంలో ఉన్నాయి. సంబంధిత వాహనాల యజమానులు సదరు వాహనాలకు సంబంధించిన సరైన ధృవపత్రాలను తీసుకవచ్చి కరీంనగర్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్‌ను కలిసి చూపించినట్లయితే వాటిని పరిశీలించి సదరు వాహనాల యజమానులకు అప్పగించడం జరుగుతుంది. 2020వరకు పోలీసుల ఆధీనంలో ఉన్న వాహనాలకు సంబంధించిన వివరాలను ష్ట్రజూం:ౌ/ుఫ్వతీ.ఞశీఎ/ఞజూఝ్మతీఱఎఝ్ఞుృతీ , ష్ట్ర జూం//ఞఞ.ట్ఖఞవఎశీశీఞ.ఞశీఎ/ఞజూ.ఝ్మతీఱఎఝ్ఞుృతీ లలో అందుబాటులో ఉంచారు. ఇతర వివరాలకోసం ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ జి తిరుమల్ సెల్‌నెంబర్ 9440795108 లేదా 8978542888 నెంబర్లద్వారా సంప్రదించాలి. కమిషనరేట్ పోలీసులు గతంలోనూ ఇలాంటి వాహనాలకు వేలం నిర్వహించిన విషయం విదితమే.

## ఏపీలో భారీగా కొత్త కేసులు.. వందకుపైగా కరోనా మరణాలు

అమరావతి, మే 11: ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మహమ్మారి విజృంభిస్తున్నది. రోజురోజుకు కొత్తగా నమోదయ్యే రోజువారీ కేసుల సంఖ్య వేగంగా పెరుగుతున్నది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం సాయంత్రం వరకు గడిచిన 24 గంటల్లో కూడా భారీగా కొత్త కేసులు నమోదయ్యాయి. ఒక్కరోజే 20,345 కొత్త కేసులు నమోదైనట్లు ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ తెలిపింది.

కొత్త కేసులతో కలిపి ఏపీలో మొత్తం కేసుల సంఖ్య 13,22,934కు చేరింది. గడిచిన 24 గంటల్లో కొత్తగా 108 కరోనా మరణాలు సంభవించడంతో మొత్తం కరోనా మృతుల సంఖ్య 8,899కి పెరిగింది. ఇక గడిచిన 24 గంటల్లో 14,502 మంది కరోనా బారి నుంచి కోలుకోగా మొత్తం రికవరీల సంఖ్య 11,18,933కు చేరింది. ఇదిలావుంటే ఏపీలో ప్రస్తుతం 1,95,102 యాక్టివ్ కేసులు ఉన్నాయి.

## 13 రాష్ట్రాల్లో లక్షకుపైగా యాక్టివ్ కేసులు: కేంద్రం

న్యూఢిల్లీమే 11: : కరోనా వైరస్ ప్రభావం దేశంలోని 13 రాష్ట్రాల్లో అత్యధికంగా ఉన్నదని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, గుజరాత్, పశ్చిమబెంగాల్, ఛత్తీస్‌గఢ్, హర్యానా, మధ్యప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో యాక్టివ్ కేసుల సంఖ్య లక్షకు పైగా ఉన్నదని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఈ 13 రాష్ట్రాల జాబితాలో 5,93,150 యాక్టివ్ కేసులతో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉండగా.. 1,05,104 కేసులతో బీహార్ చివరి స్థానంలో ఉన్నదని తెలిపింది.

**తెలంగాణలో తగ్గుతున్న కేసులు**

ఇక 50 వేలకు పైన, లక్షకు తక్కువ యాక్టివ్ కేసులు ఉన్న రాష్ట్రాలు ఆరు ఉన్నాయని, 50 వేల లోపు యాక్టివ్ కేసులు ఉన్న రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు 17 ఉన్నాయని కేంద్ర ఆరోగ్యశాఖ ప్రకటించింది. తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్, హర్యానా, ఛత్తీస్‌గఢ్, బీహార్, గుజరాత్, ఉత్తరాఖండ్, జార్ఖండ్, చండీగఢ్, లఢఖ్, డామన్ అండ్ డయ్యూ, లక్షద్వీప్, అండమాన్ అండ్ నికోబార్ ఐలాండ్స్‌లో రోజువారీ కొత్త కేసుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తున్నదని వెల్లడించింది.

**కేసులు పెరుగుతున్న రాష్ట్రాలు**

ఇదిలావుంటే కర్ణాటక, కేరళ, తమిళనాడు, పశ్చిమబెంగాల్, ఒడిశా, పంజాబ్, అసోం, జమ్ము అండ్ కశ్మీర్, గోవా, హిమాచల్‌ప్రదేశ్, పుదుచ్చేరి, మణిపూర్, మేఘాలయా, త్రిపుర, నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో మాత్రం రోజువారీ కొత్త కేసుల సంఖ్య పెరుగుతూ ఉండటం ఆందోళన కలిగిస్తున్నదని ఆరోగ్యశాఖ తెలిపింది.

## రేపటి నుంచి భద్రాచలంలో దర్శనాలు నిలిపివేత

భద్రాద్రి కొత్తగూడెంమే 11: : కరోనా కట్టడికి తెలంగాణ ప్రభుత్వం లాక్‌డౌన్ విధించిన నేపథ్యంలో రేపటి నుంచి ఈ నెల 21 వరకు భద్రాచలంలో భక్తుల దర్శనాలు నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు మంగళవారం తెలిపారు. రేపు ఉదయం 10 గంటల వరకే భక్తుల దర్శనాలకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశాయి.స్వామివారి నిత్య కైంకర్యాలు అంతరంగికంగా యథావిధిగా కొనసాగిస్తాయని వెల్లడించాయి. రాష్ట్రంలో రేపటి నుంచి 10 రోజులపాటు లాక్‌డౌన్ విధిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. యాదాద్రిలోనూ భక్తుల దర్శనాలను నిలిపివేస్తూ ఆలయవర్గాలు నిర్ణయం తీసుకున్నాయి.

## మహారాష్ట్ర, యూపీ, ఢిల్లీలో తగ్గిన కరోనా కేసులు

న్యూఢిల్లీ, మే 11: మహారాష్ట్ర, యూపీ, ఢిల్లీ, చత్తీస్ ఘడ్ రాష్ట్రాల్లో కొవిడ్-19 కేసులు తగ్గుముఖం పట్టడం ఊరట కలిగిస్తోంది. ఈ రాష్ట్రాల్లో రోజువారీ కొవిడ్-19 పాజిటివ్ కేసుల నమోదు తగ్గగా కర్నాటక, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పంజాబ్ రాష్ట్రాల్లో కరోనా కేసులు అధికమయ్యాయని ఆరోగ్య మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది.

గడిచిన 24 గంటల్లో ఢిల్లీలో 12,481 తాజా కేసులు వెలుగుచూడగా పాజిటివిటీ రేటు 17.76 శాతానికి తగ్గింది. మహమ్మారి బారినపడి ఒక్కరోజే దేశ రాజధానిలో 347 మంది మరణించారు. ఇక 13 రాష్ట్రాల్లో లక్షకు పైగా యాక్టివ్ కేసులున్నాయని, 26 రాష్ట్రాల్లో పాజిటివిటీ రేటు 15 శాతం పైగా ఉందని ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

## నగరంలోని ప్రధాన బస్టాండ్లలో పెరిగిన ప్రయాణికుల రద్దీ



హైదరాబాద్ , మే 11: కరోనా కట్టడికి తెలంగాణ ప్రభుత్వం రేపటి నుంచి 10 రోజులపాటు లాక్‌డౌన్ విధించడంతో చాలామంది స్వగ్రామాలకు ప్రయాణమయ్యారు. దీంతో నగరంలోని ప్రధాన బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ పెరిగింది. నిన్నటిదాక అరకొర ప్రయాణికులతో కనిపించిన ఎంజీబీఎస్, జేబీఎస్ బస్టాండ్‌లు ప్రయాణికులతో నిండిపోయాయి.

రేపు 10 గంటల వరకు మాత్రమే ప్రయాణానికి అనుమతి ఉండటంతో రాష్ట్రంలో సుదూర ప్రాంతాలకు వెళ్లే వారు హడావిడిగా ప్రయాణమయ్యారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులను అందుబాటులో ఉంచేందుకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. బస్సుల్లో ప్రయాణించే వారు విధిగా మాస్కులు ధరించాలని. చేతులు శానిటైజ్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## రికార్డు స్థాయిలో 1278 సబ్సిడీ దరఖాస్తులను క్లియర్ చేసిన నేషనల్ హార్టికల్చర్ బోర్డు

హైదరాబాద్ , మే 11: వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయంప్రతిపత్త సంస్థ నేషనల్ హార్టికల్చర్ బోర్డ్ (ఎన్‌హెచ్‌బీ) దేశంలో హైటెక్ వాణిజ్య ఉద్యానవన సమగ్ర అభివృద్ధికి రికార్డు స్థాయిలో దాదాపు 1278 సబ్సిడీ దరఖాస్తులను క్లియర్ చేసింది. గత ఏడాది కాలంగా పంట కోత, కోల్డ్ చైన్ మౌలిక సదుపాయాలకు తగిన ప్రోత్సాహానికి సంబంధించిన పలు దరఖాస్తులు ఎన్‌హెచ్‌బీ క్లియర్ చేసిన వాటిలో ఉన్నాయి. ఇవి గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉంటూ వస్తున్నాయి. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి, బోర్డు అధ్యక్షుడు శ్రీ నరేంద్ర సింగ్ తోమర్ నాయకత్వంలో ఈ ప్రశంసనీయమైన పనిని పూర్తి చేయడానికి ఎన్‌హెచ్‌బీ బృందం వినూత్న ప్రచారరీతిలో పనిచేసింది. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి, మేనేజింగ్ కమిటీ చైర్మన్ శ్రీ సంజయ్ అగర్వాల్ పురోగతిపై క్రమం తప్పకుండా నిఘా పెట్టి ఎన్‌హెచ్‌బీ అధికారులకు నిరంతరం మార్గనిర్దేశం చేశారు. మంత్రిత్వ శాఖ యొక్క ప్రత్యక్ష పర్యవేక్షణలో, ఈ పథకం మార్గదర్శకం, డాక్యుమెంటేషన్ కొత్త అనువర్తనాల యొక్క ప్రాసెసింగ్ ప్రక్రియను సరళీకృతం చేయడం ద్వారా.. వ్యాపారం సులభతరం చేయడానికి ఎన్‌హెచ్‌బీ చాలా చర్యలు తీసుకుంది. గడిచిన ఏడాది కాలంలో 357 మంది లబ్ధిదారులకు సబ్సిడీ విడుదల చేయగా.. 921 కొత్త ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. దేశ ఉద్యానవన రంగంలో పంటకోత, కోల్డ్ చైన్ మౌలిక సదుపాయాల ఏర్పాటుకు రూ.2.00 కోట్ల వరకు రుణం కోసం క్రెడిట్ గ్యారెంటీ కవరేజ్‌తో రుణంపై 3% వడ్డీని సమర్పించడం ద్వారా రైతులు మరియు పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ యొక్క అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ పథకంతో ఎన్‌హెచ్‌బీ సంస్థ తన బ్యాక్ ఎండ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ పథకాలను అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్‌తో కలపడానికి తగిన వీలు కల్పించింది. ఎన్‌హెచ్‌బీ బ్యాక్ ఎండ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ సబ్సిడీ పథకాలను ప్రైవేటు రంగం నుండి ఉద్యానవన రంగంలోకి భారీ పెట్టుబడులను ఆకర్షించడమే కాక, దేశంలో ఖర్చుతో కూడుకున్న గ్రీన్‌హౌస్, కోల్డ్ చైన్ టెక్నాలజీల స్వదేశీకరణలో కూడా ఇందులో కీలకమైనవి. ఎన్‌హెచ్‌బీ పథకాలు వాణిజ్యపరంగా ముఖ్యమైన పుష్పాలు, అధిక-విలువైన కూరగాయలు పలు రకాల పంటల కొరకు రక్షిత సాగులో ఎక్కువ ప్రాంతాన్ని స్థాపించగలిగాయి. దేశంలో గణనీయమైన కోల్డ్ స్టోరేజ్ సామర్థ్యం కూడా ఉన్నాయి. ఎన్‌హెచ్‌బీ యొక్క ఆర్థిక సహాయంతో, హైటెక్ వాణిజ్య ఉద్యానవనంలో దాదాపుగా 2210 ఎకరాల అదనపు విస్తీర్ణంలో ఉన్న బహిరంగ, రక్షిత పంటలను ఉద్యానవన పరిధిలోకి తీసుకురాబడింది. ఎన్‌హెచ్‌బీ కోల్డ్ స్టోరేజ్ స్కీమ్ కింద 1.15 లక్షల మెట్రిక్ టన్నుల అదనపు కోల్డ్ స్టోరేజ్ సామర్థ్యం సృష్టించబడింది.

## రైతుల ఆదాయాన్ని రెండింతలు చేయడంలో ఉద్యానవన రంగం ప్రముఖ పాత్ర పోషించగలదు

హైదరాబాద్ , మే 11: రైతుల ఆదాయాన్ని పెంచడంలో తోటల పెంపకం పాత్ర, భారీ సంభావ్యతను దృష్టిలో పెట్టుకుని, ఉద్యానవన రంగాన్ని 2021-2022 సంవత్సరంలో అభివృద్ధి చేసేందుకు భారత ప్రభుత్వం రూ.2250 కోట్లను కేటాయించింది.

దేశంలో ఉద్యానవన రంగ సంపూర్ణ వృద్ధికి, దానిని మరింత ప్రోత్సహించేందుకు, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకమైన ఉద్యానవన రంగ సమగ్ర అభివృద్ధి మిషన్ (ఎంఐడిహెచ్) కింద 2021-2022 సంవత్సరానికి వ్యవసాయ మంత్రిత్వ, రైతాంగ సంక్షేమ శాఖ కేటాయింపును రూ.2250 కోట్లకు పెంచింది. ఉద్యానవన పెంపకం ద్వారా పండ్లు, కూరగాయలు, గడ్డ దినుసులు, పుట్టగొడుగులు, మసాలా దినుసులు, పూలు, సుగంధ వృక్షాలు, కొబ్బరి, జీడిపప్పు, కొకోవా సహా పంటల సామర్థ్యాన్ని సాధించేందుకు వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఎంఐడిహెచ్‌ను 2014-15 నుంచి అమలు చేస్తోంది. గత ఏడాది కంటే ఈ కేటాయింపు చెప్పుకోతగినంతగా ఎక్కువ. వార్షిక కార్యాచరణ ప్రణాళికలను రూపొందించేందుకు ఈ కేటాయింపు గురించి రాష్ట్రాలకు/ కేంద్రపాలిత ప్రాంతాలకు సమాచారమివ్వడం జరిగింది.

ఉద్యానవన రంగంలో ప్రభుత్వ చొరవ కారణంగా దేశంలో ఉద్యానవన ఉత్పత్తి వ్యవసాయ ఉత్పత్తిని అధిగమించే పరిస్థితి వచ్చింది. ముందెన్నడూ లేని విధంగా 2019-20లో దేశంలో కేవలం 25.66 మిలియన్ హెక్టార్లలో ఉద్యానవన పంటల ఉత్పత్తి 320.77 మిలియన్ టన్నులు ఉత్పత్తి నమోదైంది. ఇక 2020-21కి తొలి ముందస్తు అంచనాల ప్రకారం దేశంలో మొత్తం 27.17 లక్షల హెక్టార్ల నుంచి ఉద్యానవన పంటల ఉత్పత్తి 326.58 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉండనుంది.

ఉద్యానవన పంటల కింద ప్రాంతాన్ని పెంచడంలో ఎంఐడిహెచ్ ప్రముఖ పాత్రను పోషించింది. ఈ క్రమంలో 2014-15 నుంచి 2-10 వరకు పంట ప్రదేశం 9%, ఉత్పత్తి 14% శాతం పెరిగాయి. అదనంగా, తోటలలో అత్యుత్తమ పద్ధతులను మిషన్ ప్రోత్సహించడం వల్ల ఉత్పత్తి నాణ్యత పెరగడమే కాదు, వ్యవసాయ భూమి ఉత్పాదకత కూడా పెరిగింది. ఎంఐడిహెచ్ చొరవ ఉద్యానవ రంగంలో భారత్‌ను స్వయం సమృద్ధి చేయడమే కాదు, ఎవరూ ఆకలితో లేకుండా, మంచి ఆరోగ్యం, క్షేమం, దారిద్ర్యం లేకపోవడం, లింగ సమానత్వం తదితర స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా దోహదం చేసింది.

అయితే, పంట కోతల తర్వాత నష్టాలు, పంట తర్వాత నిర్వహణలో, సరఫరా లంకె మౌలిక సదుపాయాల మధ్య ఉన్న వ్యత్యాసం అనే సవాళ్ళను ఇప్పటికీ ఈ రంగం ఎదుర్కొంటోంది. అంచనా వేసిన దేశవ్యాప్త డిమాండ్‌కు అనుగుణంగా 650 మిలియన్ మెట్రిక్ టన్నుల పండ్లను, కాయగూరలను 2050 నాటికి తీర్చేలా భారతీయ ఉద్యానవన ఉత్పాదకతను పెంచేందుకు ఎంతో అవకాశం ఉంది. నాటే మొక్కల సామాగ్రి ఉత్పాదకత, సామూహిక (క్లస్టర్) అభివృద్ధి కార్యక్రమం, అగ్రి ఇన్ఫ్రా నిధి ద్వారా రుణాలు, ఎఫిపిఒల ఏర్పాటు, ప్రోత్సాహం అనేవి ఈ దిశలో సరైన అడుగులు.

## దారుల్ అన్సార్ సొసైటీ ఔదార్యం...!

**-350 కుటుంబాలకు పండుగ సామగ్రి పంపిణీ**



రాజన్న సిరిసిల్ల మే, 11(నేటినిజం ప్రతినిధి): పవిత్ర రమజాన్ మాసంలో అభాగ్యులకు అండగా, నిరుపేదలకు తోడుగా కరీంనగర్ దారుల్ అన్సార్ సొసైటీ సేవలందిస్తోంది. మంగళవారం కరీంనగర్ శాలిమార్ ఫంక్షన్ హాల్ లో 150 మందికి, కేశవపట్నం, మానకొండూర్, సదశివపల్లి లో 1200 కుటుంబాలకు రూ.300 విలువ గల (ఈద్ ప్యాక్) పండుగ సామగ్రిని దారుల్ అన్సార్ బాధ్యుడు, ఫైజె అబ్రార్ మదర్సా ప్రిన్సిపాల్ హాఫీజ్ సయ్యద్ రిజ్వాన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. చక్కెర, బాస్మతి బియ్యం, డ్రైఫ్రూట్స్, నెయ్యి, సెమియా లతో కూడిన ప్యాకింగ్ లను పేదలకు పంపిణీ చేశామని చెప్పారు.

## చందుర్తి మండలంలో 13 కరోనా కేసులు...

రాజన్న సిరిసిల్ల మే, 11(నేటినిజం ప్రతినిధి): చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో మంగళవారం 13 మందికి కరోనా పాజిటివ్ వచ్చినట్లు చందుర్తి ఇన్చార్జి వైద్యాధికారి ప్రభాకర్ తెలిపారు, 45 మందికి కోవిడ్ వైద్య పరీక్షలు నిర్వహించగా 13మందికి పాజిటివ్ వచ్చినట్లు తెలిపారు, ఇందులో మూడపల్లి లో ఇద్దరికీ, చందుర్తి లో ఒకరికి, , మర్రి గడ్డలో ఒకరికి, రుద్రంగి లో ఇద్దరికీ, ఎన్గల్ లో ఒకరికి, జోగాపూర్ లో ఒకరికి,రాం రావుపల్లి లో ఒకరికి,ఆశి రెడ్డపల్లెలో ఒకరికి,సనుగుల లో ఒకరికి,మనాలలో ఇద్దరికీ, కరోనా పాజిటివ్ వచ్చినట్లు ఆయన తెలిపారు,

## ప్రజారోగ్యమే లక్ష్యంగా అద్వితీయ సేవల్లో నర్సులు..!

### (12 మే 'అంతర్జాతీయ నర్సుల దినం' సందర్భంగా)

గత శుక్రవారం మే 07న నిలోఫర్ ఆసుపత్రి కరోనా వార్డులో అవిశ్రాంతంగా సేవలు నిర్వహిస్తున్న 53 ఏండ్ల హెడ్ నర్సు స్వరూపరాణి అదే కరోనా విషకోరలకు చిక్కి తనువు చాలించిన వార్త మనందరి హృదయాలను కలిచి వేస్తున్నది. వందల వేల రోగులకు స్వాంతన చేకూర్చే చిరునవ్వుల పలుకులు, కంటికి రెప్పలా కాపాడే ఆదర్శ సేవాతత్పరులు, అందరి బాధల్ని తన బాధలుగా భావించే ఆదర్శ అతివలు, రోగి చిరునవ్వును తలిచే వైద్య సైనికులు, ఆదరణలో శిఖరాగ్ర సమానులైన కరోనా ఫ్రంట్‌లైన్ వారియర్స్, తమ ప్రాణాలను కరోనా నోట్లో పెట్టి కూడా విధి నిర్వహణలు చేసే శ్వేత వర్ణ నైటింగేల్ నర్సులు నేటి మహమ్మారి మహా ప్రళయ కష్టకాలంలో మానవాళికి ఆరోగ్య శ్వాసను అందించే వృత్తిలో నిమగ్నమై ఉన్నారు. అలుపెరుగని పోరాటం చేస్తూ, కోవిడ్-19 రోగులను ఆత్మవిశ్వాసాన్ని నింపుతూ, ప్రాణాలను కాపాడుటలో అహర్నిశలు శ్రమిస్తున్న నర్సులు మనందరికీ మానవరూపంలో ఉన్న దేవతలుగా కనిపిస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖలో గ్రామ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి ఆసుపత్రుల వరకు నర్సులు లేకుండా వైద్యం జరుగదు. వైద్యులే ప్రధానం అయినప్పటికీ, నర్సులు రోగులతో ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి, కుటుంబ సభ్యుల్లా కలిసిపోయి, వైద్య మరియు వ్యక్తిగత సేవలను అందిస్తూ, మన ఇంటి 'సిస్టర్స్'గా అద్వితీయ సేవలను అందిస్తున్నారు. కరోనా మహమ్మారి కమ్మిన విష మబ్బులను పారద్రోలే సైనికుల్లా నర్సులు ప్రజల మనస్సుల్ని చూరగొనడం చూస్తున్నాం. వైద్యులు రోగ నిర్ధారణ, మందుల సిఫార్సు, ఆపరేషన్లు లాంటి ముఖ్య సేవలు అందించినా, నర్సుల నిరంతర ప్రమేయం లేకుండా వైద్యం పూర్తి కాదు. అన్ని ఉద్యోగాల్లోకి నర్సింగ్ వృత్తి అతి పవిత్రమైందని మరియు విలువలతో కూడినదని అందరూ అంగీకరించాల్సిందే.

వైద్యరంగంలో నర్సుల పాత్రను గుర్తించిన అంతర్జాతీయ సమాజం ప్రతి ఏటా ఫ్లోరెన్స్ నైటింగేల్ (12 మే 1820 – 13 ఆగష్టు 1910) జన్మదినం సందర్భంగా 12 మే రోజున 'అంతర్జాతీయ నర్సుల దినం' ఘనంగా నిర్వహించుట జరుగుతున్నది. ఆధునిక నర్సింగ్‌కు పునాదులు వేసిన 'ఏ లేడీ విత్ ది ల్యాంప్'గా పిలువబడే ఫ్లోరెన్స్ నైటింగేల్ 1850లో యుద్ధ క్షతగాత్రుల చికిత్సలో చేతుల పరిశుభ్రత మరియు ఇతర నర్సింగ్ జాగ్రత్తలు తీసుకుంటూ మరణాలను 42 శాతం నుంచి 2 శాతం వరకు తగ్గించగలిగారు. నైటింగేల్ శతాబ్ది జన్మదినోత్సవాల సందర్భంగా 12 మే 1954తో ప్రారంభమైన ఈ నర్సుల దినోత్సవం, 1965 నుంచి అంతర్జాతీయంగా నిర్వహించుట ఆనవాయితీగా మారింది. ఈ ఏడాది అంతర్జాతీయ నర్సుల దినం-2021 నినాదంగా 'నర్సెస్ : ఏ వాయిస్ టు లీడ్ – ఏ విజన్ ఫర్ ఫ్యూచర్ హెల్త్‌కేర్' అనే సముచితమైన అంశాన్ని తీసుకొని ప్రపంచ దేశాలన్నీ ఘనంగా నిర్వహించడం ముదావహం. 'ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సెస్' నేతృత్వంలో నిర్వహించబడే అంతర్జాతీయ నర్సుల వారోత్సవాల (06 మే నుంచి 12 వరకు) వేదికగా నర్సుల సేవలను కొనియాడడం, కృతజ్ఞతలు తెలపడం, బహుమతులు/పుష్పగుచ్చాలు/గ్రీటింగ్ కార్డులు అందించడం, శుభాకాంక్షలను తెలుపడం వంటి కార్యక్రమాలను చేయటానికి ప్రయత్నించాలి. తల్లి ప్రసవ వేదనను తన నొప్పిగా భావించి శిశు జననానికి చేయూతనిచ్చి, శిశువు ఎదుగుదల, ఆరోగ్య పరిరక్షణతో ప్రారంభమై మనిషి తుది శ్వాస వరకు ప్రతి అనారోగ్య సమయంలో ఆదుకునే నర్సులు ప్రతి వ్యక్తి జీవితంలో ప్రధాన భాగమై ఉంటారు. వైద్యరంగానికి వెన్నెముకగా నర్సులు 59 శాతం వైద్య సేవలను అందిస్తున్నారు. ఐరాస మరియు ప్రపంచ ఆరోగ్య సంస్థ సంయుక్తంగా నిర్వహించే నర్సుల దినం సందర్భంగా ఆధునిక నర్సుల సేవలు, శిక్షణలో శాస్త్రీయ మార్పులు లాంటి అంశాలపై దృష్టి సారిస్తారు. ఐరాస అంచనా ప్రకారం 2030 నాటికి 18 మిలియన్ల సుశిక్షితులైన నర్సుల కొరత ఏర్పడుతుందని తేలింది. కరోనా విజృంభనతో నర్సింగ్ వృత్తి కొత్త సవాళ్ళను ఎదుర్కొంటున్నది. కోవిడ్-19 కోరల్లో చిక్కిన ప్రపంచ మానవాళికి నర్సులు అపురూప ప్రాణదాతలుగా కనిపిస్తున్నారు. పిపిఈ కిట్లు ధరించడం, కుటుంబాలకు దూరంగా పలు రోజులు ఉంటూ రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించడం లాంటి ప్రాణాపాయ విధులను ధైర్యంగా నిర్వహిస్తున్న నర్సులు సదా ప్రశంసనీయులే. రోగుల వేదనలు, రోదనలకు ఔషధాలుగా నర్సుల ప్రశాంత పలుకులు, అభయ హస్త స్పర్శలు పని చేస్తాయనేది వాస్తవం. ఫ్లోరెన్స్ నైటింగేల్ ద్విశతాబ్ది జయంతోత్సవాల సందర్భంగా 2021ను 'అంతర్జాతీయ నర్సులు మరియు మంత్రసానుల సంవత్సరం'గా కూడా పాటించుట జరుగుతున్నది.

సమాజ ఆరోగ్య మరియు జీవన ప్రమాణాలను మెరుగు పరిచే నర్సింగ్ వృత్తి భారతదేశంలో 1664లో ఈస్ట్ ఇండియా కంపెనీలో ప్రారంభమైంది. నర్సింగ్ వృత్తి మహిళలకే వర్తిస్తుందని, పురుషులకు సరికాదనే అంధవిశ్వాసం భారత సమాజంలో నెలకొని ఉంది. భారత్‌లో ప్రతి వెయ్యి మంది జనాభాకు 1.7 నర్సులు (ఒక డాక్టర్‌కు 1,511 జనాభా) మాత్రమే ఉన్నారు. ప్రతి వెయ్యి జనాభాకు ముగ్గురు నర్సులు మరియు ఒక డాక్టర్ ఉండాలని ఐరాస సూచిస్తున్నది. మన దేశంలో 3.07 మిలియన్ల రిజిస్టర్డ్ నర్సులు, 1.1 మిలియన్ల ఫార్మసిస్టులు మరియు 1.2 మిలియన్ అల్లోపతిక్ డాక్టర్లు ఉన్నారని గణాంకాలు తెలుపుతున్నాయి. ఐరాస వివరాల ప్రకారం ఇండియాలో నర్సుల కొరత అత్యధికంగా ఉందని, మన దేశం నుంచి అనేక మంది నర్సులు అమెరికా, ఇంగ్లాండ్ మరియు మిడిల్ ఈస్ట్ దేశాలను వలసలు వెళ్ళుతున్నారని తేలింది. భారతీయ నర్సులకు విదేశాల్లో మంచి ఆదరణ ఉంది. నేటి కరోనా రెండవ అల తాకిడిని తట్టుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం తాజాగా 50 వేల మంది డాక్టర్లతో పాటు పెద్ద సంఖ్యలో నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు మరియు ఇతర పారామెడికల్ సిబ్బంది సేవలను యుద్ధ ప్రాతిపదికన తీసుకోవడానికి నిర్ణయించడం ఆహ్వానించదగిన పరిణామంగా పేర్కొనవచ్చు. ఏడాదికి పైగా మహమ్మారి విలయానికి గురైన మానవాళి ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి అవిశ్రాంత వైద్య సేవలు అందిస్తున్న ఆరోగ్య సిబ్బంది, ముఖ్యంగా నర్సులను 'ఫ్రంట్‌లైన్ వారియర్స్'గా గుర్తించి, వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలను తెలపడం మన కనీస బాధ్యత.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## 10 రోజుల్లోనే పీఎం జీకే-3 కింద రెండు కోట్ల మంది లబ్ధిదారులకు 12 రాష్ట్రాలు/ యూటీల్లో లక్ష ఎంటీలకు పైగా ఆహార ధాన్యాల సరఫరా

హైదరాబాద్ , మే 11: పీఎం జీకే-3, ఒక దేశం ఒక రేషన్ కార్డ్ పథకాలు దేశంలో లక్ష్యాల మేరకు అమలు జరుగుతున్నాయని ఆహార, ప్రజా పంపిణీ శాఖ కార్యదర్శి శ్రీ సుధాన్షు పాండే తెలిపారు. వర్చువల్ విధానంలో విలేకరులతో మాట్లాడిన శ్రీ పాండే ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన(పీఎం జీకే-3) పథకాన్ని ఆహార ప్రజా పంపిణీ శాఖ గతంలో అమలు చేసిన విధంగానే మరో రెండు నెలల పాటు 2021 మే, జూన్ నెలల్లో అమలు చేస్తున్నదని తెలిపారు. పథకం కింద ఎంఎఫ్ఎస్ఏ పరిధిలోకి వచ్చే దాదాపు 80 కోట్ల మంది అంత్యోదయ అన్న యోజన, ప్రాధాన్యతా గృహస్థులు లబ్ధిదారులకు మనిషికి అయిదు కేజీల చొప్పున వారికి సరఫరా చేయవలసిన మొత్తం కంటే ఎక్కువగా ఆహార ధాన్యాలు ( బియ్యం/గోధుమలు) ఉచితంగా అందిస్తున్నామని ఆయన వివరించారు. రాష్ట్రాలు/ కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆహార సబ్సిడీ కింద అందిస్తున్న 26,000 కోట్ల రూపాయలను కేంద్రం భరిస్తుందని అన్నారు.

2021 మే నెలకు సంబంధించి పంపిణీ సజావుగా నిర్ణీత కార్యక్రమం ప్రకారం అమలు జరుగుతున్నదని శ్రీ పాండే వివరించారు. 2021 మే 10వ తేదీనాటికి భారత ఆహార సంస్థ గిడ్డంగుల నుంచి 34 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలు 15.55 ఎల్ఎంటీల ఆహార ధాన్యాలను తీసుకున్నాయని అన్నారు. వీటిలో 12 రాష్ట్రాలు/ యూటీలు రెండు కోట్ల మంది లబ్ధిదారులకు లక్ష ఎంటీల ఆహారధాన్యాలను పంపిణీ చేశాయని అన్నారు. 2021 జూన్ చివరి నాటికి మే, జూన్ నెలల ఆధార ధాన్యాల పంపిణీని పూర్తి చేయడానికి అన్ని రాష్ట్రాలు కార్యాచరణ కార్యక్రమాన్ని సిద్ధం చేశాయని ఆయన తెలిపారు.

ఆహారధాన్యాలు సకాలంలో పారదర్శక విధానంలో పంపిణీ చేయడానికి అన్ని రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాలతో తమ మంత్రిత్వశాఖ సమీక్ష నిర్వహిస్తున్నది శ్రీ పాండే అన్నారు. పథకంపై విస్తృత ప్రచారాన్ని నిర్వహించి కోవిడ్-19 మార్గదర్శకాలను పాటిస్తూ ఈపోస్ పరికరాల ద్వారా ఆహార ధాన్యాలను సరఫరా చేయాలని సూచించామని అన్నారు. పథకం అమలు జరుగుతున్న తీరును సమీక్షించడానికి రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల ఆహార కార్యదర్శులు/ ప్రతినిధులతో 2021 ఏప్రిల్ 26వ తేదీన తిరిగి మే అయిదవ తేదీన సమావేశాలను నిర్వహించామని వివరించారు.

ఒక దేశం ఒక రేషన్ కార్డు పథకానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని శ్రీ పాండే తెలిపారు. జాతీయ ఆహార భద్రతా చట్టం, 2013 కింద దేశవ్యాప్త రేషన్ కార్డుల పోర్టబిలిటీని ప్రవేశ పెట్టడానికి ఆహార ప్రజా పంపిణీ కార్యదర్శి వివరించారు. చట్టంలో తమకు కల్పించిన హక్కు ప్రకారం వలస కార్మికులు తమ ఆహార ధాన్యాలు/ ఇతర సౌకర్యాలను దేశంలో ఎక్కడైనా పొందడానికి ఈ పథకం వీలు కల్పిస్తుందని అన్నారు. ఈ వ్యవస్థ ప్రస్తుతం 32 రాష్ట్రాలు/ యూటీలలో 69 కోట్ల మంది లబ్ధిదారులకు ప్రయోజనం కలిగిస్తూ అమలు జరుగుతున్నదని అన్నారు.

32 రాష్ట్రాలు/ కేంద్రపాలిత ప్రాంతాల్లో ఒక దేశం ఒక రేషన్ కార్డు విధానం అమలు జరుగుతున్నదని శ్రీ పాండే అన్నారు. సరాసరిన ప్రతి నెల ఈ వ్యవస్థ కింద 1.5 నుంచి 1.6 కోట్ల లావాదేవీలు జరుగుతున్నాయని, ఇంతవరకు దేశ వ్యాపితంగా 26.3 కోట్ల లావాదేవీలు జరిగాయని అన్నారు. 2019 ఆగస్ట్ నెలలో ఈ పథకం ప్రారంభం అయిందని తెలిపిన శ్రీ పాండే కోవిడ్-19 సమయంలో ఏప్రిల్ 2020-ఏప్రిల్ 2021ల మధ్య 18.3 కోట్ల లావాదేవీలు జరిగాయని అన్నారు. జాతీయ ఆహార భద్రతా కల్పించిన హక్కులు ఈ పథకం ద్వారా వలస కార్మికులకు అందుతున్నాయని గుర్తించిన ప్రభుత్వం దీనిని పూర్తి స్థాయిలో అమలు చేయడానికి చర్యలతీసుకుంటుందని అన్నారు. పథకంపై అవగాహన కల్పించడానికి ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తూ 14445 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి తేవడంతో పాటు 'మేరా రేషన్' యాప్ ను ప్రారంభించామని అన్నారు. ఎన్ఐసి సహకారంతో ఇటీవల అభివృద్ధి చేసిన 'మేరా రేషన్' యాప్ తొమ్మిది వేర్వేరు భాషలలో. ఇంగ్లీష్, హిందీ, ఒరియా, పంజాబీ, తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, గుజరాతీ లలో ఉందని అన్నారు. త్వరలో మరికొన్ని ప్రాంతీయ భాషల్లో దీనిని అభివృద్ధి చేస్తామన్నారు.

2021-22 రబీ మార్కెటింగ్ సీజన్ లో పంటల సేకరణ సజావుగా సాగుతున్నదని తెలిపిన శ్రీ పాండే 2021 మే తొమ్మిదవ తేదీ నాటికి 337.95 ఎల్ఎమ్‌టి గోధుమలు సేకరించినట్లు తెలిపారు. గత సంవత్సరంలో ఇదే సమయానికి 248.021 ఎల్ఎమ్‌టి గోధుమలను సేకరించారు. గత ఏడాది ఇదే సమయానికి 28.15 లక్షల మంది ప్రయోజనం పొందగా ఈ ఏడాది 34.07 లక్షల మంది ప్రయోజనం పొందారని తెలిపారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 19,030 కొనుగోలు కేంద్రాల ద్వారా పంటల సేకరణ జరుగుతున్నదని తెలిపారు. హర్యానా, పంజాబ్ రాష్ట్రాలు కూడా కనీస మద్దతు ధర మొత్తాన్ని పరోక్ష విధానములో కాకుండా ప్రత్యక్ష పద్దతిలో చెల్లించడం ప్రారంభించాయని, దీనివల్ల జాప్యం లేకుండా రైతులు తమకు రావలసిన మొత్తాలను పొందుతున్నారని, ఇవి వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అవుతున్నాయని అన్నారు.

గోధుమ సేకరణ ద్వారా ఇప్పటివరకు మొత్తం 49,965 కోట్ల రూపాయల మొత్తం డిబిటి చెల్లింపులో నేరుగా భారతదేశం అంతటా రైతుల ఖాతాలోకి బదిలీ చేయబడిందని, ఇందులో పంజాబ్‌లో రూ .21,588 కోట్లు, హర్యానాలో సుమారు రూ .11,784 కోట్లు నేరుగా బదిలీ చేసినట్లు కార్యదర్శి తెలిపారు.

కోవిడ్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గోధుమ మరియు బియ్యం నిల్వలను బహిరంగ మార్కెట్లో సులభంగా అందుబాటులో ఉంచాలనే లక్ష్యంతో భారత ప్రభుత్వం 2021-22 సంవత్సరానికి బహిరంగ మార్కెట్ లో అమ్మకాల విధానాన్ని సరళీకృతం చేసిందని శ్రీ పాండే చెప్పారు. కొనుగోలు చేయని రాష్ట్రాల్లో ఈ విధానం కింద ఆహార ధాన్యాల అమ్మకాలు ప్రారంభం అయ్యాయని,ఇప్పటివరకు 2800 ఎంటీ అమ్మకాలు జరిగాయని తెలిపారు.

కోవిడ్ -19 సమయంలో 928.77 ఎల్ఎమ్‌టి ఆహార ధాన్యాలు, 363.89 ఎల్ఎమ్‌టి గోధుమలు మరియు 564.88 ఎల్ఎమ్‌టి బియ్యం 1.4.2020 నుంచి 31.3.2021 వరకు సెంట్రల్ పూల్ నుండి పంపిణీ చేసినట్లు తెలిపారు.

వంట నూనెల ధరల పెరుగుదల గురించి అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ నూనెల ధరను ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తోందని శ్రీ పాండే అన్నారు. కోవిడ్ కారణంగా వివిధ ఏజెన్సీల క్లియరెన్స్ సంబంధిత అంశాల వల్ల కొన్నినిల్వలు పోర్టులలో ఇరుక్కుపోయాయని ఇప్పుడు సమస్యను పరిష్కరించిందని అన్న శ్రీ పాండే త్వరలోనే నిల్వలు మార్కెట్లో విడుదల అవుతాయని ఇది చమురు ధరలపై ప్రభావాన్ని చూపుతుందని అన్నారు.

చక్కెర రాయితీపై మరో ప్రశ్నకు సమాధానమిస్తూచ క్కెర మరియు ఇథనాల్ పరిశ్రమతో సవివరమైన సమీక్ష జరుగుతోందని శ్రీ పాండే తెలియజేశారు. ఈ సంవత్సరం 7.2% బ్లెండింగ్ లక్ష్యాన్ని సాధించామని ఇది ఈ సంవత్సరం చివరి నాటికి మేము 8.5% కి చేరుతుందని అన్నారు. దేశంలోని 11 రాష్ట్రాలు ఇప్పటికే 9-10% మిశ్రమాన్ని సాధించాయని, మిగిలిన రాష్ట్రాలు బ్లెండింగ్ లక్ష్యాన్ని సాధించడానికి కృషి చేస్తున్నాయని ఆయన అన్నారు.

## ఇన్‌గ్రామ్ మైక్రో ఐఎన్‌సీలో 100 శాతం షేరు హోల్డింగ్, పూర్తి నియంత్రణను ఐమోలా అక్విజిషన్ కార్పొరేషన్ పొందేందుకు సీసీఐ ఆమోదం

హైదరాబాద్ , మే 11: ఐమోలా అక్విజిషన్ కార్పొరేషన్ పొందేందుకు చేసిన ప్రతిపాదనకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం తెలిపింది. ఇన్‌గ్రామ్ మైక్రో ఐఎన్‌సీ దాని మాతృ సంస్థలైన (తి) జీసీఎల్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ ఐఎన్‌సీ, జీసీఎల్ ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్ ఐఎన్‌సీ మరియు (తితి) దాని ప్రత్యక్ష, పరోక్ష అనుబంధ సంస్థలలో (సమిష్టిగా ఇంగ్రామ్ మైక్రో అని పిలుస్తారు) 100 శాతం వాటా కొనుగోలుకు సంబంధించి సీసీఐ వద్ద ప్రతిపాదన చేయడమైంది. ఐమోలా అనేది ప్లాటినం ఈక్విటీ గ్రూపుకు చెందిన కొత్తగా విలీనము చేయబడిన సంస్థ.

ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, టెలికమ్యూనికేషన్స్, లాజిస్టిక్స్, మెటల్ సర్వీసెస్, తయారీ, పంపిణీతో సహా విస్తృతమైన వ్యాపారాలలో వినియోగదారులకు సేవలు మరియు పరిష్కారాలను అందించే సంస్థల విలీనం, సముపార్జన మరియు ఆపరేషన్ల విభాగంలో ప్లాటినం ఈక్విటీ గ్రూప్ ప్రత్యేకతను కలిగి ఉంది. ఇన్‌గ్రామ్ మైక్రో అనేది అమెరికా ప్రధాన కార్యాలయంగా గల ఐటీ సంస్థ, ఇది టెక్నాలజీ పంపిణీ, లాజిస్టిక్స్, క్లౌడ్ సొల్యూషన్స్, ఈ-కామర్స్ సరఫరా గొలుసు సేవల్లో ప్రత్యేకత కలిగి ఉంది. దీనికి సంబంధించి సీసీఐ యొక్క వివరణాత్మక అర్డర్ వెలువడాల్సి ఉంది.

## ఆపరేషన్ సముద్రసేతు ఎఎ లో భాగంగా భారత నేవల్ షిప్ త్రిఖండ్ ముంబైకి చేరుకుంది




హైదరాబాద్ , మే 11: ఆపరేషన్ సముద్ర సేతు ఎఎ లో భాగంగా, ఖతార్‌లోని హమద్ పోర్ట్ నుండి ముంబైకి లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్ (ఎల్ఎంఓ) క్రయోజెనిక్ కంటైనర్లను రవాణా చేయడానికి భారతీయ నావికాదళ షిప్ త్రిఖండ్ను పంపించారు. ఈ నౌక 05 మే 21 న ఖతార్‌లోకి ప్రవేశించి 40 ఎమ్‌టి లిక్విడ్ ఆక్సిజన్‌తో సోమవారం ముంబై చేరుకుంది. కొవిడ్మహమ్మారికి వ్యతిరేకంగా భారతదేశం చేస్తున్న పోరాటానికి మద్దతుగా ఫ్రెంచ్ మిషన్ "ఆక్సిజన్ సాలిడారిటీ బ్రిడ్జ్" లో భాగంగా ఈ కంటైనర్ను పంపించారు. ఫ్రెంచ్ ఎయిర్ లిక్విడ్ కంటైనర్లను ఖతార్ నుండి భారతదేశానికి రవాణా చేసిన తొలి సముద్రయానం ఇది. ఖతార్‌లోని భారత రాయబారి డాక్టర్ దీపక్ మిట్టల్ సహకారంతో ఇండో-ఫ్రెంచ్ ఇనిషియేటివ్ వల్ల వచ్చే రెండు నెలల్లో 600 ఎమ్‌టి ఎల్ఎంఓను భారత్‌కు రవాణా చేసే అవకాశం ఉంది. మొదటి కంటైనర్ను మహారాష్ట్ర రాష్ట్ర అధికారులకు, మహారాష్ట్ర ప్రభుత్వ పర్యాటక, పర్యావరణ శాఖ మంత్రి ఆదిత్యలకు ముంబైలోని ఫ్రెంచ్ కాన్సులేట్ జనరల్, కాన్సుల్ జనరల్ సోనియా బార్బ్రీ సమక్షంలో అందజేశారు.

## హర్ ఘర్ జల్' కేంద్రపాలిత ప్రాంతం అవుతున్న పుదుచ్చేరి

హైదరాబాద్ , మే 11: కేంద్రపాలిత ప్రాంతంలోని ప్రతి గ్రామీణ గృహానికి ట్యాప్ కనెక్షన్ ఉండేలా చూసుకోవడం ద్వారా పుదుచ్చేరి 'హర్ ఘర్ జల్' యుటిగా మారింది. దీనితో, గోవా, తెలంగాణ మరియు అండమాన్ ఒ నికోబార్ తరువాత పుదుచ్చేరి నాల్గవ రాష్ట్రం / యుటి అవుతుంది. ఇది కేంద్ర ప్రభుత్వ ప్రధాన కార్యక్రమం అయిన జల్ జీవన్ మిషన్ పథకం కింద ప్రతి గ్రామీణ గృహానికి పంపు నీటి సరఫరాను అందిస్తుంది.

కోవిడ్ -19 మహమ్మారి కారణంగా సవాళ్లు ఎదురైనప్పటికీ 2024 నాటికి ప్రతి గ్రామీణ గృహానికి క్రమం తప్పకుండా మరియు దీర్ఘకాలిక ప్రాతిపదికన తగిన పరిమాణంలో సురక్షితమైన ట్యాప్‌వాటర్‌ను అందించడానికి రాష్ట్రాలు / యుటిల భాగస్వామ్యంతో జల్ జీవన్ మిషన్ అమలు చేయబడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలు ఇంట్లో క్రమం తప్పకుండా చేతులు కడుక్కోవడం మరియు పబ్లిక్ స్టాండ్ పోస్టుల వద్ద రద్దీని నివారించడం ద్వారా శారీరక దూరాన్ని కొనసాగించడం వంటివి జెజెఎం విజయానికి మరొక సూచిక. అసెంబ్లీ ఎన్నికల కారణంగా ఈ విజయం ఆలస్యం అయినప్పటికీ.. యుటి అడ్మినిస్ట్రేషన్ ప్రయత్నాలు ప్రశంసనీయం.

ఇంకా, పంజాబ్ రాష్ట్రం మరియు దాద్రా ఒ నగర్ హవేలి మరియు డామన్ ఒడయ్యూ యుటిలు కూడా 75% గ్రామీణ గృహాలను పంపు నీటి సరఫరాతో కవర్ చేసే మైలురాయిని దాటాయి. పంజాబ్‌లోని 34.73 లక్షల్లో 26.31 లక్షల కుటుంబాలు (76%) కుళాయి నీటి సరఫరా అందుతుండగా 2022 నాటికి అన్ని గ్రామీణ గృహాలకు 100% కవరేజ్ చేయాలని ఆ రాష్ట్రం యోచిస్తోంది.

పుదుచ్చేరిలోని మొత్తం 1.16 లక్షల గ్రామీణ కుటుంబాలకు ఇప్పుడు పంపు నీటి సరఫరా ఉంది. నిర్ణీత వ్యవధి కంటే యుటి 'హర్ ఘర్ జల్' హోదాను యూటీ సాధించింది. 2021 ఏప్రిల్‌లో యుటి వార్షిక కార్యాచరణ ప్రణాళిక ఖరారు సందర్భంగా ఎంజిఎన్ఆర్ఇజిఎస్, జెజెఎం, ఎస్‌బిఎం (జి), పిఆర్ఐలకు 15 వ ఎఫ్‌సి గ్రాంట్లు, జిల్లా ఖనిజ అభివృద్ధి నిధి, కాంపా, గ్రామీణ స్థాయిలో సిఎస్ఆర్ ఫండ్, లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ ఫండ్, మరియు దీర్ఘకాలిక తాగునీటి భద్రతను సాధించడానికి ఈ వనరులను డొవెటైల్ చేయడం ద్వారా గ్రామ కార్యాచరణ ప్రణాళిక (విఎపి) తయారు చేయాలని నిర్దేశించింది. యుటి తన నీటి నాణ్యత పరీక్షా ప్రయోగశాలలకు ఎన్ఎబిఎల్ అక్రిడిటేషన్ / గుర్తింపును పొందాలని మరియు అన్ని తాగునీటి వనరులను ప్రచార రీతిలో పరీక్షించాలని యోచిస్తోంది.

పుదుచ్చేరి యుటి ఇప్పుడు ఇళ్ళ నుండి బయటకు వచ్చే గ్రేవాటర్‌ను సమర్థవంతమైన చికిత్స మరియు పునర్వినియోగం కోసం యోచిస్తోంది. నీటి వనరుల స్థిరత్వం కోసం యుటి చురుకుగా పనిచేస్తోంది. పాండిచ్చేరి ప్రాంతం, కరైకల్, యానాం మరియు మాహే నాలుగు ప్రాంతాలు వేర్వేరు ప్రదేశాలలో ఉన్నాయి. భౌగోళికంగా ఒకదానికొకటి వేరు చేయబడ్డాయి. పుదుచ్చేరిలో అదృష్టవశాత్తూ వివిధ నదులు మరియు ఉపనదులు ఉన్నాయి. పుదుచ్చేరి జిల్లాలో ఐదు, కరైకల్ జిల్లాలో ఏడు, మహే జిల్లాలో రెండు మరియు యానాం జిల్లాలో ఒకటి నదులు సముద్రంలోకి ప్రవహిస్తున్నాయి. కానీ ఏదీ భూభాగంలో లేదు. పుదుచ్చేరిలో 84 నీటిపారుదల ట్యాంకులు మరియు 500 కు పైగా చెరువులు ఉన్నాయి. ఇవి భూగర్భజల రీఛార్జింగ్ వ్యవస్థలు, తాగునీరు మరియు వ్యవసాయానికి జీవనాడి. పుదుచ్చేరి చెరువులు మరియు స్థానిక నీటి వనరుల పునరుజ్జీవనం కోసం నిరంతరం కృషి చేస్తోంది. ఇది తాగునీటి సరఫరా పథకాలకు కీలకమైనది. యుటి చక్కగా జాబితా చేయబడిన ఐఇసి ప్రణాళిక ద్వారా సమర్థవంతమైన సమాజ సమీకరణ మరియు భాగస్వామ్యం సాధించబడుతుంది.

2024 నాటికి దేశంలోని ప్రతి గ్రామీణ గృహానికి పంపు నీటి కనెక్షన్‌ను అందించాలని లక్ష్యంగా పెట్టుకున్న కేంద్ర ప్రభుత్వం అందులో భాగంగా జెజెఎంను ప్రధాన కార్యక్రమంగా చేపట్టింది. జల్ జీవన్ మిషన్ కింద 2021-22లో రూ .50,011 కోట్ల బడ్జెట్ కేటాయింపులతో పాటు, 15 వ ఫైనాన్స్ కమిషన్ కింద రూ .26,940 కోట్ల భరోసా నిధి ఆర్ఎల్‌బి / పిఆర్ఐలకు ఉంది. ఈ విధంగా 2021-22లో గ్రామీణ గృహాలకు పంపు నీటి సరఫరా ఉండేలా దేశంలో రూ.1 లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టాలని యోచిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ తరహా పెట్టుబడులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పెంచుతాయి.




## కనువిప్పు కలిగేలా చూడు రాజన్న

రాజన్న సిరిసిల్ల మే, 11(నేటినిజం ప్రతినిధి): మున్సిపల్ సిబ్బంది చేసిన పొరపాటు వాహనదారుల కు ఇబ్బందులు కలిగిస్తున్నది. వేములవాడ పట్టణంలో రాజన్న క్షేత్రం సమీపంలో మురికి కాల్వల శుభ్రం చేసేందుకు మున్సిపల్ సిబ్బంది డ్రైనేజీ ఓపెన్ చేయడంతో వాహదారులు అందులో పడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్కూటర్ మీద వెళ్తున్న ఓ యువకుడు స్కూటర్ తో సహా మురికి కాలువలో పడ్డాడు. ఇది గమనించిన స్థానికులు యువకుడి తో పాటు స్కూటర్ ను బయటకు తీశారు. మరమ్మతులు చేసే ప్రదేశంలో ఎలాంటి హెచ్చరికల సూచిక బోర్డు లు పెట్టక పోవడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని పట్టణ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులకు కనువిప్పు కలిగేలా ' రాజన్న కొద్దిగా ఇటు చూడు'అని పట్టణ వాసులు దేవున్ని వేడుకుంటున్నారు

# ఆక్సిజన్ కోసం కేంద్రం బహుముఖ వ్యూహం!

హైదరాబాద్ , మే 11: దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో ఆక్సిజన్ కు డిమాండ్ విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం బహుముఖ వ్యూహంతో అనేక కీలక చర్యలు తీసుకుంది. ఆక్సిజన్ లభ్యతను, పంపిణీని క్రమబద్ధీకరించడం, ఆక్సిజన్ నిల్వకు సంబంధించి మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం వంటి అనేక చర్యలను ప్రభుత్వం చేపట్టింది. ఆక్సిజన్ సరఫరా వ్యవస్థపై దృష్టిని కేంద్రీకరిస్తూ ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంది. ఆక్సిజన్ ఉత్పత్తిని మెరుగుపరచడం, ఆక్సిజన్ సరఫరా, రవాణాను పటిష్టపరిచేందుకు ట్యాంకర్ల లభ్యతను పెంచడం, చివరి గమ్యస్థానం వరకూ ఆక్సిజన్ నిల్వ సదుపాయాన్ని మెరుగుపరచడం, ఆక్సిజన్ సేకరణకు సంబంధించిన నిబంధనలను సడలించడం వంటి చర్యలు కూడా తీసుకున్నారు.

ఉత్పత్తి సామర్థ్యాన్ని ఉత్పత్తిని పెంచడం ద్వారా ఆక్సిజన్ లభ్యతను పెంపొందించారు. ఇందుకోసం ప్రెషర్ స్వింగ్ అడ్సార్పన్షన్ (పి.ఎస్.ఎ.) ప్లాంట్లను ఏర్పాటు, విదేశాలనుంచి వైద్యపరమైన ద్రవీకృత ఆక్సిజన్ దిగుమతి, ఆక్సిజన్ కాంసన్ట్రేటర్ల సేకరణ వంటి చర్యలు తీసుకున్నారు. ఆక్సిజన్ రవాణా వ్యవస్థను క్రమబద్ధం చేయడంలో భాగంగా, ట్యాంకర్ల లభ్యతను పెంచడానికి నైట్రోజెన్, ఆర్గోన్ ట్యాంకర్లను ఆక్సిజన్ రవాణాకు అనుగుణంగా తీర్చిదిద్దారు, ట్యాంకర్లను, కంటెయినర్లను ఇందుకోసం దిగుమతి చేసుకున్నారు. దేశీయంగా ట్యాంకర్ల తయారీని ప్రోత్సహించారు. తక్కువ వ్యవధిలో ఆక్సిజన్ అందుబాటులో ఉండేలా చేసేందుకు రైల్వేలు, విమానాల ద్వారా ట్యాంకర్ల సరఫరాను చేపట్టారు. మొత్తం సరఫరా ప్రక్రియపై పర్యవేక్షణకు ఆక్సిజన్ డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థ (ఒ.డి.టి.ఎస్.)ను ఏర్పాటు చేశారు. ట్యాంకర్లను నడిపే డ్రైవర్ల లభ్యతను పెంచే ప్రయత్నంలో భాగంగా ఎం.హెచ్.వి. డ్రైవర్లకు అవసరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చారు. ఆక్సిజన్ నిల్వలను మెరుగుపరిచేందుకు, ఆసుపత్రులవద్ద క్రయోజెనిక్ ట్యాంకర్ల సంఖ్యను, వాటి సామర్థ్యాన్ని కూడా పెంచారు. తద్వారా మెడికల్ ఆక్సిజన్ సిలిండర్లను సేకరిస్తున్నారు. కీలకమైన ఆక్సిజన్ సరఫరా వేగంగా జరిగేందుకు వీలుగా సాధారణ ఆర్థిక నిబంధనల సడలింపును చేపట్టారు. ఆక్సిజన్ ఉత్పత్తి, రవాణా, నిల్వ, మౌలిక సదుపాయాల పరంగా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలకు సంబంధించిన వివరాలను ఈ కింద చూడవచ్చు.

## ఆక్సిజన్ ఉత్పత్తి పెంపు, సామర్థ్యం పెరుగుదల

2020 ఆగస్టులో ఆక్సిజన్ రోజువారీ ఉత్పత్తి 5,700 మెట్రిక్ టన్నులుండగా, 2021 మే నెలలో రోజువారీ ఉత్పత్తిని 9,446 మెట్రిక్ టన్నులకు పెంచారు. రోజువారీ ఉత్పత్తి సామర్థ్యం 6,817మెట్రిక్ టన్నుల నుంచి, 7,314 మెట్రిక్ టన్నులకు పెరిగింది. ఇదే కాలంలో సామర్థ్య వినియోగం 84శాతంనుంచి 129 శాతానికి పెరిగింది.

దేశ వ్యాప్తంగా మెడికల్ ఆక్సిజన్ కు ఏర్పడిన డిమాండుకు తగినట్టుగా ఉత్పత్తిని పెంచేందుకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లోని ఉక్కు కంపెనీలు కూడా ఎంతో కృషి చేశాయి. 2021వ సంవత్సరం మే నెల 4వ తేదీ నాటికి ఉక్కు ఫ్యాక్టరీలు ఉత్పత్తి చేసిన ద్రవరూప మెడికల్ ఆక్సిజన్ (ఎల్.ఎం.ఒ.) మొత్తం పరిమాణం 3,680.30 మెట్రిక్ టన్నులుగా ఉంది. ఏప్రిల్ మధ్యలో సగటున 1,500నుంచి 1,700 మెట్రిక్ టన్నులుగా ఉన్న మొత్తం రోజువారీ ఎల్.ఎం.ఒ. ఏప్రిల్ 25వ తేదీనాటికల్లా 3,131.84 మెట్రిక్ టన్నులకు పెరిగింది. మే నెల 4వ తేదీకల్లా ఇది మరింత పెరిగి, 4,076.65 మెట్రిక్ టన్నులకు చేరింది.

పెరిగిన ఉత్పత్తి, డిమాండ్లకు అనుగుణంగా, దేశంలో ద్రవరూప మెడికల్ ఆక్సిజన్ (ఎల్.ఎం.ఒ.) అమ్మకం కూడా బాగా పెరిగింది. 2021 మార్చిలో రోజువారీ అమ్మకం దాదాపు 1,300 మెట్రిక్ టన్నులు ఉండగా, మే నెల 6వ తేదీ నాటికి ఇది 8,920 మెట్రిక్ టన్నులకు పెరిగింది. కోవిడ్-19 వైరస్ మహమ్మారి తొలి ఉధృతి సందర్భంగా, 2020 సెప్టెంబరు 29నాటికి ఎల్.ఎం.ఒ. రోజువారీ గరిష్ట అమ్మకం 3,095 మెట్రిక్ టన్నులుగా నమోదైంది. ఆ తర్వాత ఈ విక్రయం ఐదు రెట్లకు పైగా పెరిగింది. ఈ ఏడాది మార్చి నెలాఖరున 1,559 మెట్రిక్ టన్నులున్న రోజువారీ అమ్మకం, ఈ ఏడాది మే నెల 3వ తేదీ నాటికి 8,000మెట్రిక్ టన్నులకు చేరింది.

## ఆక్సిజన్ ఉత్పత్తి సామర్థ్యం పెంపుదలకు ప్రణాళికలు

ఆక్సిజన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సమీప భవిష్యత్తులో గణనీయంగా పెంచేందుకు వీలుగా అదనపు ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత విస్తృతం చేసేందుకు సంకల్పించారు. ఇందులో భాగంగా, కర్ణాటక రాష్ట్రంలో ప్రతి రోజూ అదనంగా 70మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ ఉత్పత్తి జరగవచ్చని భావిస్తున్నారు.; చిన్న మధ్యతరహా పారిశ్రామిక రంగానికి చెందిన ఎయిర్ సపరేషన్ యూనిట్ నుంచి సరఫరాను పెంచారు; ఇక, రిఫైనరీలనుంచి ఆక్సిజన్ వాయువు సరఫరా వ్యవస్థతో కూడిన (11,950 పడకల) భారీ ఆసుపత్రులను, 3,850 పడకలకు సరఫరా చేయగలిగే విద్యుత్ ప్లాంట్లను, 8,100 పడకలకు సరఫరా చేయగలిగే ఉక్కు ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. అత్యవసరం కాని పారిశ్రామిక ప్రయోజనాలకు ఆక్సిజన్ సరఫరా చేయడంపై ఈ ఏడాది ఏప్రిల్ 22నుంచి నిషేధం విధించారు. దీనితో అదనంగా వెయ్యి మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ అందుబాటులోకి వచ్చింది. ఇక ఉక్కు రంగంలో ప్రతి రోజూ అదనంగా 630 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ ను ఉత్పత్తి జరిగేలా తయారీ సామర్థ్యాన్ని పెంచాలని ఆ రంగం సంకల్పించింది.

డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు సమీపంలో ఆక్సిజన్ సరఫరాను మెరుగుపరిచేందుకు 1,594 పి.ఎస్.ఎ. ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. పి.ఎం. కేర్స్ నిధి కింద కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ద్వారా ఈ ఏడాది మార్చిలో మంజూరైన 162 ప్లాంట్లు, రక్షణ పరిశోధనా అభివృద్ధి సంస్థ (డి.ఆర్.డి.ఒ.) ద్వారా, పి.ఎం. కేర్స్ నిధి కింద 500 ప్లాంట్లు, పెట్రోలియం సహజవాయు మంత్రిత్వ శాఖ ద్వారా చమురు గ్యాస్ కంపెనీల ఆధ్వర్యంలో దాదాపు వంద ప్లాంట్లు, ఆయా రాష్ట్రాలు సొంతంగా నిర్మించే ప్లాంట్లు ఈ కోవలోకి వస్తాయి. కొత్తగా నిర్మించ తలపెట్టిన 162 పి.ఎస్.ఎ. ప్లాంట్లలో 74 ప్లాంట్లను ఇప్పటికే ఏర్పాటు చేశారు. మిగిలిన ప్లాంట్లను వచ్చే జూన్ నాటికి స్థాపించబోతున్నారు. ఇక పి.ఎం. కేర్స్ నిధి కింద ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో అదనంగా మంజూరైన 1,051 ప్లాంట్లు కూడా దశలవారీగా ఏర్పాటు కానున్నాయి. రాబోయే మూడు నెలల్లో ఇవి ఏర్పాటయ్యే అవకాశాలున్నాయి.

## ద్రవరూప మెడికల్ ఆక్సిజన్ (ఎల్.ఎం.ఒ.) దిగుమతి

విదేశాలనుంచి 50,000 మెట్రిక్ టన్నుల ద్రవరూప ఆక్సిజన్ ను దిగుమతి చేసుకోనున్నారు. ఇందులో 5,800మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ బట్వాడా, ఆర్డర్లకు సంబంధించి షెడ్యూలు ఇప్పటికే ఖరారైపోయింది. విదేశాలనుంచి ఆక్సిజన్ తెప్పించే వనరులను సాధనలో విదేశాంగ మంత్రిత్వ శాఖ ఎంతో క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. ఈ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు కొటేషన్లను సేకరించారు. దాదాపు 3,500 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ దిగుమతికి సంబంధించి 3 కొటేషన్లు అందాయి. ఈ ఏడాది ఏప్రిల్ 21వ తేదీన వాటిని ఆమోదించారు. ఈ కొటేషన్లకు సంబంధించి రాబోయే 3నెలల్లో ఆక్సిజన్ బట్వాడా కానుంది. దీనికి తోడు, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బహ్రెయిన్, కువైట్, ఫ్రాన్స్ దేశాలనుంచి 2,285 మెట్రిక్ టన్నుల ఎల్.ఎం.ఒ. దిగుమతి అవుతోంది. ఇందులో కొంతభాగం ఇప్పటికే మన దేశం చేరుకుంది.

## ఆక్సిజన్ కాన్సంట్రేటర్ల సేకరణ

పి.ఎం. కేర్స్ నిధి కింద లక్ష ఆక్సిజన్ కాన్సంట్రేటర్ల సేకరణకు ఈ ఏడాది ఏప్రిల్ 27న ఆమోదం లభించింది. ఇందుకు సంబంధించి ఏప్రిల్ 29వ తేదీన ఎక్స్ ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ టెండర్లు జారీ అయ్యాయి. 2,500 ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను సరఫరా చేయగలమంటూ ఈ టెండర్ల ద్వారా సంసిద్ధత తెలిపారు. అలాగే, చమురు సహజవాయు సంస్థ (ఒ.ఎన్.జి.సి.) ప్రారంభించిన టెండరుకు మంచి స్పందన లభించింది. 50,000 ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను సరఫరా చేయగలమంటూ స్వదేశీ తయారీదార్లు సంసిద్ధత వ్యక్తం చేశారు. 9,800 యూనిట్ల సరఫరాకు సంబంధించి ఆమోదం కుదిరింది. అందులో 4,800 కాన్సంట్రేటర్లను ఈ నెల 15వ తేదీన, 500 కాన్సంట్రేటర్లను ఈ నెల 27వ తేదీన బట్వాడా చేయనున్నారు. దీనికి అదనంగా 70వేలనుంచి 75వేల కాన్సంట్రేటర్లను సరఫరా చేయగలమంటూ బిడ్డర్లుగా 55 సంస్థలు ఆసక్తిని కనబరిచాయి. ఇందుకు సంబంధించిన ఆర్డర్ల ఖరారు ప్రక్రియ తుదిదశలో ఉంది.

## ఆక్సిజన్ కేటాయింపు ప్రక్రియ

డిమాండుకు అనుగుణంగా అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతిపదికన ఆక్సిజన్ వాయువును సరఫరా చేసేందుకు వీలుగా ఆక్సిజన్ కేటాయింపు ప్రక్రియను ఏర్పాటు చేశారు. ఆక్సిజన్ కేటాయింపునకు సంబంధించిన తొలి ఆర్డరు ఈ ఏడాది ఏప్రిల్ 15న జారీ అయింది. అయితే, ఇది మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, మధ్యప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాలకే పరిమితమైంది. కోవిడ్ మహమ్మారి వ్యాప్తికి సంబంధించిన రెండవ ఉధృతి ఇతర రాష్ట్రాలకు కూడా ప్రబలడంతో ఇతర రాష్ట్రాలనుంచి కూడా ఆక్సిజన్ కు డిమాండ్ పెరిగిపోయింది. ప్రతి రాష్ట్రంలోనూ తలెత్తే కోవిడ్ యాక్టివ్ కేసులకు అనుగుణంగా సంబంధిత రాష్ట్రంలో ఆక్సిజన్ ఆవశ్యకతను అంచనా వేసేందుకు కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ రూపొందించిన ఫార్ములాను వినియోగిస్తున్నారు. ప్రతి రాష్ట్రంలో అవసరానికి అనుగుణంగా ఆక్సిజన్ ను కేటాయించేందుకు గరిష్టస్థాయిలో కృషి జరుగుతోంది. ఆక్సిజన్ కేటాయింపును ఖరారు చేసేముందుగా, సంబంధిత రాష్ట్రంలో ఆసుపత్రి మౌలిక సదుపాయాలు, ఐ.సి.యు. పడకల వసతి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నారు.

దేశంలో ఆక్సిజన్ పంపిణీని క్రమబద్ధం చేసేందుకు ఆక్సిజన్ కేటాయింపు ప్రక్రియను ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా రూపుదిద్దుతూ వస్తున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆక్సిజన్ కేటాయింపు క్రియాశీలకంగా, ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిబంధనలకు అనుగుణంగా ఉంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, తయారీదార్లు, ఇతర భాగస్వామ్య వర్గాలతో సంప్రదింపులను కూడా ఆక్సిజన్ కేటాయింపు ప్రక్రియకు ప్రాతిపదికగా పరిగణిస్తున్నారు. ఆక్సిజన్ ఉత్పత్తి చేసే రాష్ట్రాలకు, దాన్ని వినియోగించుకునే రాష్ట్రాలకు మధ్య పొంతన కనిపించడం లేదు. అందువల్ల ఆక్సిజన్ కేటాయింపులో రాష్ట్రాల మధ్య సమాన ప్రాతిపదికను అనుసరించవలసి ఉంది. ఆక్సిజన్ ఉత్పత్తిలో మూడవ వంతు తూర్పు ప్రాంతంలో కేంద్రీకృతమైంది. డిమాండులో 60 శాతం ఉత్తర, దక్షిణ రాష్ట్రాలనుంచి ఉత్పన్నమవుతోంది. దీనితో డిమాండ్ ఉన్న ప్రాంతాలకు ఆక్సిజన్ రవాణా చేసేందుకు సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఆక్సిజన్ ఉత్పత్తి ప్రాంతాలు, అది చేరవలసిన గమ్యస్థానం వంటి వివరాలతో గరిష్ట స్థాయి రవాణా ఏర్పాట్లతో ఒక ప్రణాళిక రూపకల్పన పూర్తి చేశారు. ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, ఆక్సిజన్ తయారీదార్లు, ఇతర భాగస్వామ్య వర్గాలతో సంప్రదింపుల అనంతరం ఈ కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు.

## ఆక్సిజన్ ట్యాంకర్ లభ్యతను పెంచడం -ట్యాంకర్లను మార్పుచేయడం, ట్యాంకర్ల దిగుమతి

ఆక్సిజన్ ట్యాంకర్ల లభ్యతను మెరుగుపరిచేందుకు అనేక చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం నైట్రోజెన్, ఆర్గాన్ ట్యాంకర్లను మార్పు చేయడం, వాటిని దిగుమతి చేసుకోవడం వంటి చర్యలు తీసుకున్నారు. 2020 మార్చిలో ట్యాంకర్ల సామర్థ్యం 12,480 మెట్రిక్ టన్నులు కాగా, ట్యాంకర్ల సంఖ్య 1,040గా ఉంది. ఇపుడు ట్యాంకర్ల సామర్థ్యం 23,056 మెట్రిక్ టన్నులకు, ట్యాంకర్ల సంఖ్య 1,681కి పెరిగింది. వాటిలో మార్పు చేసిన 408 ట్యాంకర్లు, దిగుమతి చేసుకున్న 101 ట్యాంకర్లు ఉన్నాయి. మొత్తం 1,105 నైట్రోజెన్, ఆర్గాన్ ట్యాంకర్లలో ఇప్పటివరకూ 408 ట్యాంకర్లను,.. ఆక్సిజన్ రవాణా చేసేవిధంగా మార్పు చేశారు. త్వరలో మరో 200 ట్యాంకర్లను కూడా ఇలా మార్పు చేయనున్నారు. 248 ఆక్సిజన్ ట్యాంకర్లను దిగుమతి చేసుకుంటున్నారు. వాటిలో 101 ట్యాంకర్లు ఇప్పటికే దిగుమతి అయ్యాయి. మరో 58 ట్యాంకర్లు రానున్న పది రోజుల్లో దిగుమతి కానున్నాయి. వీటికి తోడు మరో వంద ట్యాంకర్లను స్వదేశీయంగానే తయారు చేస్తున్నారు.

## వ్యవధిని తగ్గించేందుకు రైల్వేలు, విమానాల ద్వారా ఆక్సిజన్ ట్యాంకర్ల రవాణా

ఆక్సిజన్ ట్యాంకర్లను దూర ప్రాంతాలకు రవాణా చేసేందుకు రైల్వేలను వినియోగిస్తున్నారు. ఇప్పటివరకూ రైల్వేలు, దాదాపు 4,200 మెట్రిక్ టన్నుల ద్రవరూప మెడికల్ ఆక్సిజన్ (ఎల్.ఎం.ఒ.) ను 248కి పైగా ట్యాంకర్ల ద్వారా దేశంలోని వివిధ రాష్ట్రాలకు రవాణా చేశాయి. ఇప్పటికే 68 ఆక్సిజన్ ఎక్స్ ప్రెస్.లు తమ ప్రయాణాన్ని ముగించాయి. ఈ నెల 9వ తేదీ సాయంత్రానికి 293 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ మహారాష్ట్రకు చేరింది. అలాగే, 1,230 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి, 271 మెట్రిక్ టన్నులు మధ్యప్రదేశ్ కు, 555 మెట్రిక్ టన్నులు హర్యానాకు, 123 మెట్రిక్ టన్నులు తెలంగాణకు, 40 మెట్రిక్ టన్నులు రాజస్థాన్ కు, 1,679 మెట్రిక్ టన్నులు ఢిల్లీకి రైల్వేల ద్వారా చేరింది.

రవాణా సమయం తగ్గించే ప్రయత్నంలో భాగంగా ఖాళీ ట్యాంకర్లను యుద్ధ విమానాల ద్వారా రవాణా చేశారు. ఇలా 5,505 మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న 282 ట్యాంకర్లను ఈ పద్ధతిలో రవాణా చేశారు. ఆ తర్వాత దేశీయ రూట్లలో ఆక్సిజన్ ను ఈ ట్యాంకర్ల ద్వారా రవాణా చేశారు. 1,293 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో కూడిన 75 కంటెయినర్లను భారతీయ వైమానిక దళం విమానాల ద్వారా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు. దీనికి అదనంగా, 1,252 ఆక్సిజన్ సిలిండర్లను, 3 ఆక్సిజన్ ఉత్పాదకన ప్లాంట్లను వైమానిక దళ విమానాల ద్వారా దిగుమతి చేసుకున్నారు.

## ఆక్సిజన్ డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థ(ఒ.డి.టి.ఎస్.)

దేశంలో ఆక్సిజన్ రవాణాకు పట్టే వ్యవధిని వాస్తవ ప్రాతిపదికన తెలుసుకునేందుకు వెబ్ ఆధారంగా, యాప్ ఆధారంగా పనిచేసే ఆక్సిజన్ డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థ (ఒ.డి.టి.ఎస్.) ప్రారంభించారు. ఆక్సిజన్ కేటాయింపు ఆర్డర్లకు సంబంధించి ఎప్పటికప్పుడు ప్లాంట్లకు అందజేసే సమాచారం, ప్లాంట్లనుంచి ఆక్సిజన్ పంపిణీ చేసే సమాచారం, ప్లాంట్లనుంచి వివిధ రాష్ట్రాలకు సరఫరా అయ్యే సమాచారం ఇలాంటి వివరాలన్నీ తెలుసుకోవడానికి ఈ వ్యవస్థ దోహదపడుతుంది. ఈ-వేబిల్, జి.పి.ఎస్., డ్రైవర్ మొబైల్ నంబర్ (సిమ్), ఫాస్టాగ్ వంటి అంశాలతో సమీకృతం చేస్తూ ఈ వ్యవస్థను రూపొందించారు. ఆక్సిజన్ రవాణా వాహనాలు నేరుగా గమ్యం చేరేందుకు, అనవసర జాప్యాలను నివారించేందుకు ఒ.డి.టి.ఎస్. ఉపకరిస్తుంది. దీనికి తోడు, ఈ వ్యవస్థను సమన్వయం చేసేందుకు వర్చువల్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఈ కంట్రోల్ రూమ్ ద్వారా,.. ఆరోగ్య, రైల్వేశాఖలు, రహదారులు, ఉక్కు శాఖల అదనపు కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు ఆక్సిజన్ రవాణాను పర్యవేక్షిస్తారు. అలాగే సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు కూడా ఈ వ్యవస్థను పర్యవేక్షించేందుకు వీలు కల్పించారు. ఆక్సిజన్ రవాణాను నిర్విరామంగా పర్యవేక్షించేందుకు, రవాణాలో ఎదురయ్యే ఎలాంటి సమస్యలనైనా పరిష్కరించేందుకు ఈ కంట్రోల్ రూమ్ వ్యవస్థ దోహదపడుతుంది.

## ట్యాంకర్ల నడపడంలో డ్రైవర్లకు శిక్షణ

ఆక్సిజన్ ట్యాంకర్లను సరిగా నడిపేందుకు వీలుగా 2,500మంది డ్రైవర్లకు శిక్షణ కల్పిస్తున్నారు. డ్రైవర్లకు జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఎన్.ఎస్.డి.సి.), లాజిస్టిక్ రంగపు నైపుణ్య మండలి (ఎల్.ఎస్.ఎస్.సి.) ఈ శిక్షణ ఇస్తున్నాయి. ఆక్సిజన్ రవాణాను నిరాటంకంగా సాగించాలంటే నైపుణ్యం కలిగిన డ్రైవర్లు అవసరం. ద్రవరూప మెడికల్ ఆక్సిజన్ రవాణాకు, ప్రమాదకర రసాయనాల నియంత్రణ నిబంధనలు వర్తిస్తాయి కాబట్టి, తగిన శిక్షణ, నైపుణ్యంతో పాటు, హెచ్.ఎ.జెడ్. కార్గో లైసెన్సు కలిగిన డ్రైవర్లను మాత్రమే అనుమతిస్తారు. ఈ నేపథ్యంలో డ్రైవర్లు అనుసరించదగిన శిక్షణా మాడ్యూల్ ను ఇంగ్లీషు, హిందీ భాషల్లో రూపొందించే అంశంపై ఎన్.ఎస్.డి.సి., ఎల్.ఎస్.ఎస్.సి. సంస్థలు తమ దృష్టిని కేంద్రీకరించాయి. శిక్షణ కోసం 20మంది ట్రెయినర్లను కూడా గుర్తించారు. అంత క్రియాశీలకంగా లేని డ్రైవర్లకోసం ఆన్ లైన్ ద్వారా పునశ్చరణ తరగతులను ఏర్పాటు చేశారు. ఆక్సిజన్ ప్లాంట్లతో సహా డ్రైవర్లకు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించేందుకు 73 ప్రాంతాలను గుర్తించారు.

## ఆక్సిజన్ నిల్వ సదుపాయం పెంపుదల.క్రయోజెనిక్ ట్యాంకులు

ఆసుపత్రి వద్ద ఆక్సిజన్.ను నిల్వ ఉంచే క్రయోజెనిక్ ట్యాంకుల సంఖ్యను పెంచారు. గత ఏడాది మార్చిలో ఇవి 609 ఉండగా వాటి సంఖ్యను తాజాగా 901కి పెంచారు. మెడికల్ ఆక్సిజన్ సిలిండర్ల లభ్యతను కూడా గణనీయంగా పెంచారు. గత ఏడాది మార్చిలో 4.35 లక్షలుగా ఉన్న సిలిండర్ల సంఖ్యను 2021 మే నాటికి 11.19 లక్షలకు పెంచారు. డిమాండ్ అంచనాలకు అనుగుణంగా అదనంగా 3.35 లక్షల సిలిండర్లను సేకరించే ప్రక్రియ కూడా సాగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ 21వ తేదీకల్లా అదనంగా 1,27,000 సిలిండర్లకోసం ఆర్డర్లు పెట్టారు. పి.ఎం. కేర్స్ నిధి కింద డి.ఆర్.డి.ఒ. 10,00,000 ఎన్.ఆర్.ఎం. వాల్వులను సేకరిస్తోంది. వినియోగంలో ఆక్సిజన్ వృథా కాకుండా అరికట్టేందుకు ఇవి దోహదపడతాయి.

## కీలకమైన సరఫరాల కోసం చర్యలు

కోవిడ్ చికిత్సా నిర్వహణలో భాగంగా ఆక్సిజన్ సరఫరా ప్రక్రియలో కీలకమైన సరఫరాలు సజావుగా జరిగేలా చూసేందుకు సాధారణ ఆర్థిక నిబంధనలను (జి.ఎఫ్.ఆర్.ను) సడలించారు. మరిన్ని భాగస్వామ్య వర్గాలకు ప్రవేశం కల్పించేలా, వేగంగా ఆక్సిజన్ సేకరణ ప్రక్రియ జరిగేలా చూసేందుకు ఆంక్షలతో కూడిన నిబంధనలన్నింటినీ తొలగించి వేశారు. కీలకమైన కోవిడ్ చికిత్సకోసం జరిగే సేకరణలకోసం వందశాతం అడ్వాన్స్ చెల్లింపును ఆమోదించారు. సరఫరామార్కెట్ నిబంధనలు సహకరించని చోట నామినేషన్ ప్రాతిపదికన ఆక్సిజన్ సేకరణ ప్రక్రియ జరిపేందుకు ఆమోదం తెలిపారు.

# కరోనా రోగులకు మెరుగైన వైద్యం అందించండి



జోగులాంబ గద్వాల మే 11: జిల్లా దవాఖానలో చికిత్స పొందుతున్న కరోనా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని దవాఖానాలో చికిత్స పొందుతున్న కరోనా రోగులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దవాఖానాలో ఆక్సిజన్ కొరత లేకుండా చూడాలని వైద్యులకు సూచించారు. కరోనా సోకిన వారు ఎవరు భయపడవద్దన్నారు. ధైర్యంగా ఉంటే కరోనాను జయించవచ్చని ఎమ్మెల్యే తెలిపారు.

దవాఖానలో రోగులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే నా దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా వైద్యాధికారి చందు నాయక్, పురపాలక చైర్మన్ కేశవ్ తదితరులు ఉన్నారు.

# గద్వాల మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

జోగులాంబ గద్వాల మే 11: గద్వాల పురపాలక సంఘం అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం పురపాలక సంఘం పరిధిలో ఈద్గా దగ్గర రూ. 29 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సహకారంతో గద్వాల పురపాలక అభివృద్ధికి పుష్కలంగా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

ఇప్పటికే మున్సిపాలిటీలో పలు వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు డ్రైనేజీ పనులు చేపట్టి పూర్తి చేశామన్నారు. ఎమ్మెల్యే వెంట పురపాలక చైర్మన్ కేశవ్. కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# రుయాలో చనిపోయింది 11 మంది కాదు 30 మంది: లోకేష్

అమరావతి, మే 11: తిరుపతి రుయా ఆస్పత్రి ఘటనపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నారా లోకేష్ ఘాటుగా స్పందించారు. తిరుపతి రుయా ఆసుపత్రిలో కరోనా రోగులు చనిపోలేదని, దయలేని జగన్ ప్రభుత్వమే చంపేసిందని ఆరోపించారు. ఈ ఘటనలో 11 మంది కాదు 30 మంది మరణించారని రుయా ఆసుపత్రి ముందు నిరసన తెలుపుతున్న ఓ ప్రత్యక్షసాక్షి చెబుతున్నారని లోకేష్ వెల్లడించారు.

"ఐదు నిమిషాలు మాత్రమే ఆక్సిజన్ సరఫరా నిలిచిపోయిందనేది అబద్ధం? 11 మందే చనిపోయారనేది అంతకంటే పెద్ద అబద్ధం. అధికారులు వచ్చి మా ముందు మాట్లాడాలి అంటూ బాధితులు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా సర్కారు దొంగ మాటలు, దొంగ లెక్కలు మాని వాస్తవాలు బయటపెట్టాలి" అని లోకేష్ డిమాండ్ చేశారు. మీడియాపై ఆంక్షలు, ప్రతిపక్ష నేతల అక్రమ అరెస్టులతో వాస్తవాలు దాగవని తెలిపారు. ఆక్సిజన్ కొరతతో రాష్ట్రంలో ఇప్పటికే 76 మందికి పైగా చనిపోయారని, ఇంకెంత మంది ప్రాణాలు బలిగొంటారని ప్రశ్నించారు. జగన్ ఇప్పటికైనా మూర్ఖత్వాన్ని పక్కనబెట్టి మానవత్వంతో ఆలోచించాలని హితవు పలికారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు కల్పించాలని, ప్రభుత్వ నిర్లక్ష్యంతో చనిపోయినవారిని ప్రభుత్వ హత్యలుగా భావించి తక్షణమే వారి కుటుంబ సభ్యులను ఆదుకోవాలని లోకేష్ డిమాండ్ చేశారు.

# ఏపీకి 2 లక్షల డోసుల కోవాగ్జిన్ టీకాలు..




అమరావతి, మే 11: ఏపీలో కరోనా కట్టడికి వ్యాక్సినేషన్ కార్యక్రమాం మళ్లీ ఊపందుకోనుంది. రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అమలు చేయాలనుకుంటున్నప్పటికీ? టీకాల కొరత అడ్డంకిగా మారింది. దీంతో వ్యాక్సిన్లు పంపాలంటూ ముఖ్యమంత్రి జగన్ కేంద్ర ప్రభుత్వానికి పలుమార్లు లేఖలు కూడా రాశారు. తాజాగా హైదరాబాద్ నుంచి విజయవాడలోని గన్నవరం ఎయిర్ పోర్ట్ కు 2 లక్షల కోవాగ్జిన్ టీకాలు చేరుకున్నాయి. వీటిని గన్నవరంలోని వ్యాక్సిన్ నిల్వ కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి వివిధ జిల్లాలకు పంపిణీ చేయనున్నారు. మరోవైపు, వ్యాక్సిన్ ను ఫార్మా కంపెనీల నుంచి నేరుగా కొనుగోలు చేసేందుకు రాష్ట్రాలకు కేంద్రం అనుమతినిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఆ దిశగా కూడా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

# వ్యాక్సిన్ల వినియోగం ధనిక దేశాల్లోనే ఎక్కువ: WHO

హైదరాబాద్ , మే 11: కరోనా మహమ్మారి ప్రపంచ దేశాలను పట్టిపీడిస్తున్నది. పేద, బీద అనే భేదం లేకుండా అన్ని దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. అయితే అభివృద్ధి చెందిన దేశాలు తమ దగ్గరున్న మెరుగైన వైద్య సదుపాయాలతో మహమ్మారిని కొంతవరకు వేగంగా కట్టడి చేయగులుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన వ్యాక్సిన్ల వినియోగంలో ధనిక దేశాలే ముందున్నాయి. స్వయంగా డబ్ల్యూహెచ్వో గణాంకాలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచంలో ధనిక, ఎగువ మధ్యతరగతి దేశాల జనాభా 53 శాతం ఉండగా.. ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న వ్యాక్సిన్లో 83 శాతాన్ని ఆ దేశాలే వినియోగించాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ) తెలిపింది.

కానీ పేద దేశాలు మాత్రం ఈ వైరస్ను సరైన రీతిలో కట్టడి చేయలేక విలవిల్లాడుతున్నాయి. పేద దేశాల్లో పరిస్థితి ఇంత దారుణంగా ఉందని పేర్కొంది. పేద, దిగువ మధ్యతరగతి దేశాల జనాభా ప్రపంచ జనాభాలో 47 శాతం ఉందని, కానీ ఆయా దేశాల్లో వ్యాక్సిన్ వినియోగం కేవలం 17 శాతం మాత్రమే ఉన్నదని డబ్ల్యూ వెల్లడించింది. ఈ మేరకు డబ్ల్యూ చీఫ్ టెడ్రోస్ అధనోమ్ గెబ్రియేస్ ఒక ప్రకటన చేశారు.

# జాతీయ సాంకేతిక విజ్ఞాన దినం నాడు శాస్త్రవేత్తల కు నమస్కరించిన ప్రధాన మంత్రి

హైదరాబాద్ , మే 11: జాతీయ సాంకేతిక విజ్ఞాన దినం సందర్భంలో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ శాస్త్రజ్ఞుల ను, సాంకేతిక విజ్ఞానం పట్ల వారికి గల ఉద్వేగాన్ని ప్రశంసించారు.

"జాతీయ సాంకేతిక విజ్ఞాన దినం నాడు, మనం మన శాస్త్రవేత్త ల కఠోర శ్రమ కు, వారి గట్టి పట్టుదల కు, అలాగే సాంకేతిక విజ్ఞానం పట్ల వారి మక్కువ కు వందనమాచరిద్దాం. 1998వ సంవత్సరం లో జరిగిన పోఖ్ రణ్ పరీక్షలు భారతదేశ విజ్ఞానశాస్త్ర, సాంకేతిక విజ్ఞాన సంబంధి సత్తా ను చాటడాన్ని మనం గర్వంగా గుర్తుకు తెచ్చుకొందాం.

ఎలాంటి సవాలు తో నిండినటువంటి స్థితి లో అయినా, మన శాస్త్రవేత్తలు, నూతన ఆవిష్కర్త లు సందర్భానికి తగినట్లు గా ప్రతిస్పందించి, మరి సవాలు ను శమింపచేయడం కోసం కృషి చేశారు. గత ఏడాది కాలానికి పైగా, వారు కోవిడ్-19 తో పోరాడడానికి కష్టపడి పనిచేశారు. వారి స్ఫూర్తి ని, అసాధారణమైనటువంటి ఉత్సుకత ను నేను అభినందిస్తున్నాను" అని ప్రధాన మంత్రి అనేక ట్వీట్ లలో పేర్కొన్నారు.

# కరోనాపై ఆందోళన వద్దు : ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

జనగామ మే 11: : కరోనా రెండో దశ పై ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావొద్దని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన వంద పడకల కొవిడ్ ఐసోలేషన్ వార్డును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎవరైనా అస్వస్థతకు గురైతే స్థానిక ప్రభుత్వ దవాఖానలో వైద్యం పొందవచ్చున్నారు.

అనవసరంగా హైరానా పడి హైదరాబాద్కు పరుగులు తీసి లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. వైద్యులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా దవాఖానలో అన్ని రకాల సదుపాయాలు ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



# కార్యకర్తలకు అండగా టీఆర్ఎస్ : ఎమ్మెల్యే గూడెం



సంగారెడ్డి మే 11: : కార్యకర్తలకు అండగా నిలుస్తూ వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఏకైక పార్టీ టీఆర్ఎస్ అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామానికి చెందిన తలారి ఆంజనేయులు పార్టీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.

మృతుడికి టీఆర్ఎస్ సభ్యత్వం ఉండటంతో పార్టీ తరపున రెండు లక్షల రూపాయల ఇన్సూరెన్స్ డబ్బులు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి బాధిత కుటుంబానికి మంగళవారం ఇన్సూరెన్స్ చెక్కును అందజేశారు. కార్యకర్తలకు అండగా నిలుస్తున్న సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

# స్టేషన్ల రైటర్లు సందేహాలకు తావులేకుండా కేసుల వివరాలను నమోదు చేయాలి

## -కరీంనగర్ పోలీస్ అడిషనల్ కమీషనర్ చంద్రమోహన్

కరీంనగర్ మే 11 (నేటినిజం ప్రతినిధి): కేసుల వివరాల నమోదులో ఎలాంటి సందేహాలకు తావులేకుండా పోలీస్‌స్టేషన్ల రైటర్లు వివరాలను నమోదు చేయాలని కరీంనగర్ పోలీస్ అడిషనల్ డిసిపి (పరిపాలన) చంద్రమోహన్ అన్నారు. పోలీస్‌స్టేషన్ల నిర్వాహణలో రైటర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. మంగళవారం నాడు కమీషనరేట్ కేంద్రంలో కమీషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లకు చెందిన రైటర్లకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ డిసిపి (పరిపాలన) చంద్రమోహన్ మాట్లాడుతూ స్టేషన్ రైటర్లు టిస్‌కాప్ యాప్‌నకు అనుసంధానం అయ్యే వివిధ రకాల యాప్‌ల వినియోగంపై పట్టుసాధించాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శ్రద్ధాసక్తులతో అవగాహన పెంపొందిం చుకోవాలన్నారు. సిసిటిఎన్ఎస్ ప్రాజెక్టులో పెండింగ్‌లో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని చెప్పారు. స్టేషన్లకు చెందిన ఎస్‌హెచ్ఓల తర్వాత కీలక పాత్ర రైటర్లదని పేర్కొన్నారు. ఇన్వెస్టిగేషన్ అధికారులకు సహాయకులుగా వ్యవహరించాలని చెప్పారు. కేసుల వివరాలను శ్రద్దాసక్తులతో పకడ్బందీగా నమోదు చేసినట్లయితే ఎలాంటి సందేహాలకు తావుండదని తెలిపారు. గుర్తింపు లభించేలా విధినిర్వాహణ కొనసాగించాలని చెప్పారు. కేసుల వివరాల నమోదులో నాణ్యతప్రమాణాలను పాటించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారానే ప్రజలకు మెరుగైన సేవలందించవచ్చని తెలిపారు. పోలీస్‌స్టేషన్లలో క్రమపద్ధతిలో రికార్డుల నిర్వాహణను కొనసాగించాలని, ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా ఎప్పటికప్పుడు కేసుల వివరాలను నమోదు చేయాలని చెప్పారు. వివిధ రకాల సమాచారాన్ని వేర్వేరుగా నిక్షిప్తం చేసినట్లయితే సులువుగా ఉండటంతోపాటు కేసుల నమోదు వివరాలు నమోదు చేయడంలో ఎలాంటి అనుమానాలు ఉన్నా వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. మిస్సింగ్ కేసుల విషయంలో గుర్తింపు చిహ్నాలను స్పష్టంగా నమోదుచేయాలని తెలిపారు. హిస్టరీషీటర్ల చిరునామాలు, వారి చిత్రాలు, జీవనోపాధికోసం ఎక్కడ ఉంటున్నారో తదితర విషయాలను కూడా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. సెలవులు, ఇతర రకాలశాఖాపరంగా ఉన్న సమస్యలను హెచ్ఆర్‌యంఎస్ విధానం ద్వారా దృష్టికి తీసుకరావాలని చెప్పారు. ఈ సమావేశంలో మానకొండూరు ఇన్స్‌పెక్టర్ సంతోష్‌కుమార్, సైబర్‌ల్యాబ్ ఇంఛార్జి ఆర్ఐ టి మురళిలతోపాటు వివిధ స్థాయిలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయండి : ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల ,ఖమ్మం, మే 11 (నేటినిజం ప్రతినిధి):: ఇటీవల కురిసిన వర్షాల వల్ల కొన్ని సెంటర్లలో ధాన్యం తడిసి నా తదుపరి రైతులు తిరిగి ఆరబెట్టిన తర్వాత ఆ యా సెంటర్ల లకు అదనపు లారీలను పంపించి ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం పరిచిరైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను కాంగ్రెస్ టీపీసీసీ కార్యదర్శి ఆది శ్రీనివాస్ కోరారు .

మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రైతులకు రైస్ మిల్లులకు సంబంధం లేకుండా కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యాన్ని అమ్మగానే రైతులకు సంబంధం లేకుండా తగు ఏర్పాట్లు చేయాలి కోరారు కరోనా కష్టకాలంలో రైతులందరూ కూడా భయం భయంగా మానసికంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు .రైతులు తప్పా తాలు లేకుండా చేసిన తదుపరి కొనుగోలు కూడా పూర్తయిన తర్వాత అక్కడ అక్కడ రైస్ మిల్లర్ల నుండి రైతులకు సమాచారం ఇచ్చి అదనంగా తూకం ఎత్తేయండా అని మానుకోవామానుకోవాలన్నారు టార్పాలిన్ కవర్లను అన్ని గ్రామాలలో కొనుగోలు కేంద్రాలలో సరిపడినంత అందివ్వాలి తూర్పుర యంత్రాలను కూడా ఆయా సెంటర్లకు ఎక్కువ సంఖ్యలో ప్రభుత్వం పంపించాలిని కోరారు

# నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం .

**నకిలీ విత్తనాలు ఎరువులను అమ్మకాలను అరికట్టేందుకు మండల స్థాయిలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ వ్యవసాయ అధికారి నేతృత్వంలో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు.**

**జిల్లాలో నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై ఉక్కుపాదం మోపుతం**

**-జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే , జిల్లా వ్యవసాయ అధికారి రణధీర్ రెడ్డి**



రాజన్న సిరిసిల్ల ,ఖమ్మం, మే 12జిల్లాలో నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రణధీర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై ఇప్పటికే గట్టి నిఘా ఉంచామని ఎస్పీ పేర్కొన్నారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు ఎరువులను విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే బాధ్యులపై కేసు నమోదు చేసి జైల్లో వేస్తామని హెచ్చరించారు.

రైతులు విత్తనాలను ఎరువులను కొనుగోలు చేసినప్పుడు కచ్చితంగా దుకాణదారులు నుంచి విధిగా రశీదు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.నకిలీ విత్తనాలు ఎరువులను అమ్మకాలను అరికట్టేందుకు మండల స్థాయిలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ వ్యవసాయ అధికారి నేతృత్వంలో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని ఎస్పీ పేర్కొన్నారు.జిల్లాలో ఎవరైనా నకిలీ విత్తనాలను ఎరువులను అమ్ముతున్నట్లు గుర్తిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని వారు పేర్కొన్నారు. ఈ విషయంలో పోలీస్ సిబ్బందికి మండల వ్యవసాయ అధికారులు సహకరిస్తారని వ్యవసాయ అధికారి తెలిపారు.

# వ్యాక్సినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన మంత్రి పువ్వాడ

ఖమ్మం మే 11: : కొవిడ్ నివారణ చర్యల్లో భాగంగా భక్త రామదాస్ కళాక్షేత్రంతో కొనసాగుతున్న కొవిడ్ వ్యాక్సినేషన్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌తో కలిసి రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సందర్శించారు. కొవిడ్ నివారణకు తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రెండో డోస్ వేసుకునే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని వైద్య సిబ్బందికి సూచించారు.

మంత్రి వెంట ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, మేయర్ నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, సుడా చైర్మన్ విజయ్, డీఎంహెచ్‌వో మాలతి, కార్పొరేటర్లు తదితరులు ఉన్నారు.

# కరోనా కట్టడిలో ముక్రా కే ముందంజ..

ఆదిలాబాద్ మే 11: : వలు అభివృద్ధి పనుల్లో ఆదర్శంగా నిలుస్తున్న ముక్రా కె గ్రామం కరోనా నియంత్రణలో ముందడుగు వేసింది. ఇచ్చోడ మండలం ముక్రా కే పంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛందంగా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. సరిహద్దులో కట్టెను అడ్డంగా వేసి చెక్‌పోస్ట్‌లాగా ఏర్పాటు చేశారు.

గ్రామంలోనికి ఎవరైనా వచ్చిన థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తూ శానిటైజ్ చేస్తున్నారు. బయటికెళ్తే వారి వివరాలను రిజిస్టర్‌లో రాసుకుంటున్నారు. ఇలా ప్రతి పనిని పక్కాగా చేపడుతూ గ్రామస్తులు ఆదర్శంగా నిలుస్తున్నారు.

# ప్రకృతిని కాపాడండి.. భూత దయ చూపండి : ఎంపీ సంతోష్ కుమార్

హైదరాబాద్ , మే 11: ప్రకృతిని కాపాడండి.. భూత దయ చూపండి.. అది మనల్ని కాపాడుతుందని టీఆర్ఎస్ ఎంపీ సంతోష్ కుమార్ అన్నారు. కరోనా నేపథ్యంలో మానవాళి ఎదుర్కొంటున్న సమస్యలు, ఆక్సిజన్ కోసం పడుతున్న తిప్పలను దృష్టిలో ఉంచుకుని ఎంపి సంతోష్ కుమార్ ట్విట్టర్‌లో ఓ వీడియోను పోస్టు చేశారు. మానవుడు తన మనుగడ కోసం, అభివృద్ధి పేరుతో ఏ విధంగా తోటి ప్రాణులను హరిస్తూ, ప్రకృతిని నాశనం చేసుకుంటూ వచ్చాడో వీడియోలో విషదీకరించారు.

వీడియోను పోస్టు చేస్తూ ఎంపీ ఈ విధంగా స్పందించారు. ఇది మనం దరికీ తెలిసిన విషయమే. ప్రతి చర్యకు సమానమైన ప్రతిచర్య ఉంటుంది. ప్రకృతి పట్ల, సహ జీవుల పట్ల దయ చూపండి. అది ఎన్నటికి మనకు చెడు చేయదు. పాత వీడియో అయినప్పటికీ మనం గుర్తుంచుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయి. ప్రకృతిని కాపాడండి అది మనల్ని కాపాడుతుందని ఆయన పేర్కొన్నారు.

# లాక్‌డౌన్ విజయవంతం : ఢిల్లీ సీఎం

న్యూఢిల్లీ మే 11: : కరోనా సెకండ్ వేవ్ నేపథ్యంలో దేశ రాజధానిలో విధించిన లాక్‌డౌన్ విజవంతమైందని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ప్రస్తుతం కరోనా పాజిటివ్ కేసులు తగ్గుముఖం పడుతున్నాయన్నారు. గత కొద్ది రోజులుగా ఆక్సిజన్ పడకల సంఖ్యను పెంచామని, జీటీబీ హాస్పిటల్ సమీపంలో 500 కొత్త ఐసీయూ పడకలు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీలో ఐసీయూ పడకలు, ఐసీయూ కొరత లేదని చెప్పారు. ప్రతి రోజు 1.25లక్షల మోతాదుల టీకా వేస్తున్నామని, త్వరలో మూడు లక్షల టీకాలు వేస్తామని చెప్పారు. వచ్చే మూడు నెలల్లో ఢిల్లీ వాసులందరికి టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని.. కానీ టీకాల కొరతను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం కొద్ది రోజులకే స్టాక్ మిగిలి ఉందని చెప్పారు. రెండు కంపెనీలు మాత్రమే వ్యాక్సిన్లు ఉత్పత్తి చేస్తున్నాయని, నెలకు 6 నుంచి 7 కోట్ల టీకాలు ఉత్పత్తి చేయగలుగుతాయన్నారు. ఇలా ఐతే ప్రతి ఒక్కరికీ టీకాలు వేయడానికి రెండేళ్లు పడుతుందన్నారు. అప్పటి వరకు మరిన్ని కరోనా వేవ్‌లు వస్తాయని, యుద్ధ ప్రాతిపదికన వ్యాక్సిన్ ఉత్పత్తి పెంచడం ముఖ్యమని, టీకాలు వేసేందుకు జాతీయ ప్రణాళిక రూపొందించాలని

# కరోనా ఎఫెక్ట్: నైపర్ జేఈఈ వాయిదా.. దరఖాస్తు గడువు పొడిగింపు

హైదరాబాద్ , మే 11: ఫార్మసీ కోర్సుల్లో పీజీ, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం నిర్వహించే నైపర్ జేఈఈ-2021 వాయిదాపడింది. కరోనా నేపథ్యంలో ప్రవేశపరీక్షలను వాయిదా వేస్తున్నట్లు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యుటికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (నైపర్) ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం పరీక్ష జూన్ 5న జరగాల్సి ఉన్నది. ఈ క్రమంలో అప్లికేషన్ గడువును మే 15 వరకు పొడిగిస్తున్నట్లు తెలిపింది. ఇంకా దరఖాస్తు చేసుకోనివారు రూ.3000 చెల్లించి అప్లయ్ చేసుకోవచ్చని పేర్కొంది.ఈ ప్రవేశపరీక్ష ద్వారా 968 ఎంఫార్మ్, 180 పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశాలు కల్పిస్తారు. జీపీఏ, గేట్, నెట్ క్వాలిఫై అయినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

# రెమ్‌డెసివిర్ బ్లాక్ దందా ముఠా అరెస్ట్



హన్మకొండ మే 11: : బ్లాక్ మార్కెట్‌లో రెమ్‌డెసివిర్ ఇంజెక్షన్లను విక్రయిస్తున్న ముఠాను గీసుగొండ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు.

ఈ మేరకు ఈస్ట్ జోన్ డీసీపీ వెంకటలక్ష్మి కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ బోడుప్పల్‌కు చెందిన ల్యాబ్ టెక్నీషియ న్ చందా విజయ్‌కుమార్, వరంగల్ రూరల్ జిల్లా దా మెర మండలం ఊరుగొండకు చెందిన చింతం రాజేశ్, హన్మకొండకు చెందిన మెడికల్ రిప్రజెంటేటివ్ ముం దాటి గోపాల్, ధర్మారానికి చెందిన ల్యాబ్ టెక్నీషియన్ గట్టు అవినాశ్, హన్మకొండలో మెడికల్ షాపు నిర్వహి స్తున్న వావిల సురేశ్ కరోనా చికత్సలో అత్యధికంగా వినియోగిస్తున్న రెమ్‌డెసివర్ ఇంజెక్షన్లను బ్లాక్‌లో అధిక రేట్లకు విక్రయించేందుకు ప్రణాళిక రచించారు. శంషాబాద్‌లో ఎంఆర్‌పీకి కొనుగోలు చేసి రూ. 28 వేలకు విక్రయించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో గీసుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గొర్రెకుంటలో కరోనా బాధితుడికి ఇంజెక్షన్‌ను అందించేందుకు ఆదివా రం సాయంత్రం కట్టమల్లన్న గుడి వద్ద వేచి చూస్తున్నారు. పక్కా సమాచారంతో పోలీసులు అక్కడికి చేరు కోగా పారిపోయేందుకు యత్నించారు.

నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా ఇంజెక్షన్లతో బ్లాక్ మార్కెట్‌లో దందాకు పాల్పడుతున్నట్లు వెలుగు లోకి వచ్చింది. వారి నుంచి 42 ఇంజెక్షన్లతోపాటు రూ. లక్షా 69 వేల నగదు, కారు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడం లో ప్రతిభ కనబరిచిన మామునూర్ ఏసీపీ నరేశ్, గీసుగొండ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు అబ్దుల్ రహీం, రాజు, కానిస్టేబుళ్లు పవన్‌కుమార్, కిషన్‌ను సీపీ తరు ణ్‌జోషి అభినందించారు. కాగా ప్రజాసేన అవినీతి నిరోధక స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పుప్పాల రజినీకాంత్ ఇచ్చిన సమాచారంతో నిందితు లను పట్టుకున్నట్లు తెలిసింది.

# నిరుపేద వర్గాల కోసమే కల్యాణలక్ష్మి



కరీంనగర్ మే 11: రాష్ట్ర ప్రభుత్వం ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్నదని, వారి సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో 236 మందికి 2.34 కోట్ల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు

. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలను ఆదుకో వాలన్న లక్ష్యంతోనే సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వ దవాఖానాల్లో డెలివరీ అయితే కేసీఆర్ కిట్ అందిస్తున్నారని తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు రెసిడెన్షియల్ స్కూళ్లు తీసుకువచ్చారని చెప్పారు. రైతులకు పూర్తిస్థాయిలో సాగునీటితో పాటు 24 గంటల కరెంట్‌ను కూడా అందిస్తున్నారని వివరించారు. సంక్షేమ పథకాలతో పాటు అ భివృద్ధి పరంగా ప్రభుత్వాన్ని ముందుకు తీసుకుపోతున్న సీఎం కేసీఆర్ నిండు నూరేళ్లు చల్లగా ఉం డాలని ఆడబిడ్డలందరూ ఆశీర్వదించాలని కోరారు.

**తహసీల్దార్ కార్యాలయాలు ప్రారంభం**

కరీంనగర్ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటైన మండలాల్లో తహసీల్దార్ కార్యాలయాలను మంత్రి గంగుల కమలాకర్ సోమవారం ప్రారంభించారు. కరీంనగర్ అర్బన్, రూరల్, కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణితో పాటుగా అన్ని రెవెన్యూ సేవలను ఈ కార్యాలయాల్లో అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఈ కార్యాలయాలను ఆధునీకరించడంతో పాటు అన్ని సదుపాయాలు అందించే విధంగా తీర్చిదిద్దామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్, ఆర్డీవో ఆనంద్, ఎంపీపీ లక్ష్మయ్య, కార్పొరేటర్లు గందె మాధవి, ఐలేందర్ యాదవ్, నేతికుంట యాదయ్య, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# ఎంజీఎంపై సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక శ్రద్ధ

## మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వైద్యారోగ్య అధికారులతో సమీక్ష

హన్మకొండ, మే 11: కొవిడ్ బాధితులు ఆందోళన చెందొద్దని, ధైర్యంగా ఉండాలని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం వరంగల్ అర్బన్ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అర్బన్, రూరల్ జిల్లాల్లో కొవిడ్ బాధితులకు అందుతు న్న చికిత్స, ఏర్పాట్లు తదితర అంశాలపై జిల్లా, వైద్యా రోగ్య శాఖ, ఎంజీఎం అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొవిడ్ బాధి తులకు చికిత్స అందించేందుకు అవసరమైన అన్ని ఏర్పా ట్లు చేస్తున్నామని అన్నారు. రెమ్‌డెసివిర్ ఇంజెక్షన్లు, ఆక్సి జన్ సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖాల్లో అన్ని వసతులు సమకూర్చుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఎంజీఎం దవాఖానను అభివృద్ధి చేసేందుకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. ఈ ఆస్పత్రిలో కొవిడ్ చికిత్స కోసం 800 బెడ్స్ సిద్ధంగా ఉండగా, 650 ఆక్సిజన్‌వని, 80 వెంటిలేటర్స్ పడకలున్నాయన్నారు. ఫ్రంట్‌లైన్ వారియ ర్స్ కోసం ఎంజీఎంలో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కరోనా చికిత్సకు అవసరమైన వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్ల నియామకానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**ఎంజీఎంలో హెల్ప్‌లైన్ నంబర్ 7901518231**

వరంగల్ ఎంజీఎం దవాఖానలో బెడ్స్ సౌలభ్యం, కొ విడ్ బాధితులకు అవసరమైన సమాచారం అందించేం దుకు హెల్ప్‌లైన్ నంబర్ 7901518231 ఏర్పాటు చేసి నట్లు మంత్రి తెలిపారు. వరంగల్ సెంట్రల్‌జైల్‌ను ధర్మ సాగర్‌కు తరలించి, ఏడాదిలో నిర్మాణం పూర్తి చేయను న్నట్లు చెప్పారు. ప్రస్తుతం వరంగల్ సెంట్రల్‌జైల్ ఉన్న 76 ఎకరాల స్థలంలో అత్యాధునిక టెక్నాలజీతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరే షన్, జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి కొవిడ్ వ్యాప్తి నివారణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**కేఎంసీ సూపర్ స్పెషాలిటీకి రూ. 8కోట్లు**

కాకతీయ మెడికల్ కళాశాలలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో వసతులు, సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభు త్వం రూ. 8 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి ఎర్రబెల్లి తెలి పారు. 250 బెడ్స్‌తో నాన్ కొవిడ్ చికిత్సలను అం దించనున్నట్లు ఆయన చెప్పారు. 363 మంది డాక్టర్లు, ఇతర సిబ్బందిని 15 రోజుల్లో నియమించాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, నగర మేయర్ గుండు సుధారాణి, ఎంపీలు డాక్టర్ బండా ప్రకాశ్, పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు డాక్టర్ తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్, కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, హరిత, అధికారు లు, ప్రైవేట్ ఆస్పత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కోవిడ్ తో మరణించిన సీనియర్ జర్నలిస్టు దుర్గయ్య ..!



సంగారెడ్డి 10 మే (నేటినిజం ప్రతినిధి ) నారాయణఖేడ్ నియోజకవర్గం వుదయం రిపోర్టర్ హనుమంతరావు పేట బ్యాగరి దుర్గయ్య సోమవారం నాడు మృతి చెందారు గత 16 సంవత్సరాలుగా జర్నలిస్ట్ గా పనిచేస్తూ ఉమ్మడి మెదక్ జిల్లాలో దళిత నాయకుడిగా అనేక సేవలు అందించారు ఆయన మృతికి నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఏం భూపాల్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు . సంగారెడ్డిలో జర్నలిస్టులు ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు నల్లూరి విలాస్ జి.దేవదాస్, పవన్ కుమార్, శరత్ బాబు, సాయిబాబా, మల్లేపల్లి ప్రభాకర్, పద్మ,, కిషోర్ తదితరులు పాల్గొన్నారు

# కొవిడ్ కేర్ సెంటర్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

వికారాబాదమే 11 : తాండూరులోని మాతాశిశు దవాఖానలో ఏర్పాటు చేసిన కొవిడ్ కేర్ సెంటర్‌ను తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తనికీ చేశారు. పీపీఈ కిట్టు ధరించి చికిత్స పొందుతున్న కరోనా బాధితులను పరామర్శించారు. వైద్యం సరిగ్గా అందుతుందా.. పౌష్టికాహారాన్ని ఆహారాన్ని అందిస్తున్నారా అని బాధితులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మెరుగైన వైద్యం అందిస్తుందని భయపడాల్సిన అవసరం లేదన్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.